నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
సంచిక 51 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | ఆగస్టు 19, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది
భద్రమనిరి నాడు బాల్యవయసునందు
పుస్తకమ్ములకును పుట్టవేసి
వేడుకనిరి నేడు యూడువయసునందు
చినిగినట్టి బట్ట చిత్రముగను

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


విలేకరులు కావలెను
నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.
పూర్తి వివరాలకు
తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.




# వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి

- సామాన్యుడిగా వచ్చి..అసామాన్యుడిగా ఎదిగారు
- కార్యకర్తలకు బిజెపి అధ్యక్షుడు నబీన్ హితోక్తి

**విశాఖపట్నం,ఆగస్టు 18 :** కార్యకర్త నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగిన భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పోరాటాల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే బీజేపీ

మిగతా2లో...

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

- సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గొప్ప యోధుడు
- హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ
- 2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం
- బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు
- ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం
- విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు 18 :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మిగతా2లో...

## బిఆర్ఎస్‌తో పోలిస్తే రెండింతలుగా
# భూ ఆక్రమణలు

22ఎ నిషేధిత జాబితా పేరుతో దోపిడీకి స్కెచ్
రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల రాజేందర్



**హైదరాబాద్,ఆగస్టు 18 :** గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండింతలు పెరిగిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు.

మిగతా2లో...

# నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

- ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం
- 24 గంటల్లోనే 34 రిజిస్ట్రేషన్లు పూర్తి తప్పును సరిదిద్దుకుంటున్నాం
- మీడియాతో మంత్రి పొంగులేని వివరణ



2లో



2లో

# ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

- తాగునీటికే తొలి ప్రాధాన్యం... పంటలకూ భరోసా కల్పించాలి
- అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగానే నిర్ణయాలు
- కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం.. గోదావరి బేసిన్‌లో 68.1 శాతం నిల్వలు
- నాగార్జునసాగర్‌లో 164 టీఎంసీల నీరు.. ఇంకా 47 శాతం వరద జలాలకు అవకాశం
- సింగూరు మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం
- అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

- క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రం
- పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలకు ఆహ్వానం
- 2035 నాటికి 26,000 మెగావాట్ల సోలార్, 8,000 మెగావాట్ల విద్యుత్ లక్ష్యం
- హైటెక్స్‌లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్,ఆగస్టు 18:** తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్టాన్ని తీర్చిది ద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో రెండు రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ / ఎక్స్ పో 2026'ను మంగళ వారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవ డానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే

మిగతా2లో...



# బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

- ఇష్టం వచ్చినట్లుగా ఓట్లు తొలగించడం అన్యాయం
- 22శాతం ఓట్ల తొలగింపు దుర్మార్గపు చర్య
- తెలంగాణలో సర్ ప్రక్రియను పొడిగించాలి
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ డిమాండ్

**హైదరాబాద్,ఆగస్టు 18 :** 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని

మిగతా2లో...

## 22ఏ నిషేధిత జాబితాను
# వెంటనే ఎత్తేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలి
- పనిచేయని టోల్ ఫ్రీ నెంబర్ : ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



**ఉప్పల్,ఆగస్టు 18 :** భూము లు, ఆస్తులను 22ఏ నిషేధిత జాబితా నుంచి వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ప్రజలను ఇబ్బం దులకు గురిచేస్తున్న రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి వాజపేయినగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో హరీశ్‌రావు మాట్లాడారు. మల్కాజిగిరిలో 60 ఏండ్ల నివాసిత ఇండ్లను కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను ఆందోళనకు గురిచేయడం సమంజసం కాదన్నారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని చెప్పారు. నిషేధిత జాబితాను వెంటనే తొలగించకపోతే రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభింపజేసేలా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లాలో 7,500 జీవోల ద్వారా మినహాయింపు పొందిన భూములు, మేడ్చల్‌లో

మిగతా2లో...

# వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

అతి పెద్ద పార్టీగా ఉందని అన్నారు. దేశాన్ని మరింత శక్తిమంతంగా చేయడానికి సంకల్పం తీసుకోవాలని ప్రతి కార్యకర్తకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో మంచి పాలన అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమికి మంచి విజయాన్ని అందించిన ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించడానికి కూటమి ఏర్పాటైందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై ప్రధాన మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తు చేశారు. తమ కలలను సాకారం చేసే పార్టీని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. అనేక ప్రాజెక్టులు ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి డబల్ ఇంజిన్ సర్కార్ పని చేస్తుందని అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. విపక్షం కాంగ్రెస్ పార్టీ అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. దీనిని తిప్పి కొట్టాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతారహిత్యంగా ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తు చేశారు. వాటిని ఖండించాలని పార్టీ శ్రేణులకు బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల్లో నిరాశ కనపడుతోందని వ్యాఖ్యానించారు. విపక్షం వాడే భాష.. దేశాన్ని అస్థిర పరిచేలా ఉందన్నారు. దేశం ముందుకెళ్తుంటే సహించలేక పోతున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు.ప్రస్తుత రాజకీయాల్లో విపక్షాలు, పార్ట్ టైం నాయకుల్లా తయారయ్యారని వ్యంగ్యంగా అన్నారు. యువతను ప్రభుత్వం మీద రాళ్లు విసిరేందుకు వాడితే.. మనం దేశ నిర్మాణానికి వాడుతున్నామని చెప్పారు. దేశంలోని యువతతో మమైకం కావాలని ఈ సందర్భంగా పార్టీ కేడర్‌కు సూచించారు. బీజేపీ జాతీయ వాదంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. అన్ని వర్గాల వద్దకు వెళ్లి పార్టీని ముందుకు తీసుకెళ్లి.. బలోపేతం చేయ్యాలని పార్టీ శ్రేణులను ఆయన దిశానిర్దేశర చేశారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రాప్రదేశ్ దిశగా పనిచేయాలని శ్రేణులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీలో ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై పుస్తకాన్ని జాతీయ బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ ఆవిష్కరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ కమిటీలో పదవులు పొందిన దగ్గుబాటి పురందేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా నితిన్ నబిన్ సన్మానించారు.

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

**హైదరాబాద్,ఆగస్టు 18 :** 22ఏ నిషేధిత భూముల జాబితాలోకి పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించే పక్రియను వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 24 గంటల్లోనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు.మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే పక్రియను ప్రభుత్వం వేగంగా చేపట్టిందని వివరించారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం లేదని పొంగులేటి అన్నారు. పొరపాటు జరిగితే దాన్ని అంగీకరించడం తో పాటు.. దాని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిష్కరించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన కొన్ని ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు కూడా సాంకేతిక కారణాలతో 22ఏ జాబితాలోకి చేరినట్లు తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించామని, అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల పక్రియను పునరుద్ధరించామని మంత్రి వెల్లడించారు.22ఏ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పొంగులేటి తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించనుందని, అర్హత ఉన్న నిజమైన ప్రైవేట్ ఆస్తులను వీలైనంత త్వరగా 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. పేదల హక్కులు, ఆస్తులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు.

చట్టబద్ధంగా ఉన్న పేదల భూమిలో ఒక్క అంగుళాన్ని కూడా ప్రభుత్వం తీసుకోదని అన్నారు. ఇది పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. 22ఏ సమస్యను రాజకీయంగా ఉపయోగించుకోవద్దని మంత్రి కోరారు. ప్రజల్లో అనవసరమైన ఆందోళన సృష్టించేలా ఆరోపణలు, ప్రచారం చేయడం సరికాదన్నారు. 'మేం జరిగిన తప్పును అంగీకరించి సరిదిద్దుతున్నాం. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేయడం మా ప్రభుత్వ విధానం కాదు' అని స్పష్టం చేశారు. అధికారులపై బాధ్యత నెట్టేసి ప్రభుత్వం చేతులు దులుపుకోదని, సమస్యకు పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

విప్లవాత్మక పక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఎఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే ఎఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 ఇ÷ఎ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.

# వందేమాతరమంటే కాంగ్రెస్‌కు భయం: బండి



**హైదరాబాద్,ఆగస్టు 18 :** కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ఖర్గే తీరుపై ప్రతి భారతీయుడు ఆశ్చర్యానికి లోనవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం ఆలపించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. వందేమాతరం ఆలపించడాన్ని చూసి ఒకప్పుడు బ్రిటీష్ వాళ్లు భయపడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. బ్రిటీష్ వాళ్లకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య తేడా కనిపించడం లేదన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, ఎంఐఎం మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని.. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.

# 22ఏ నిషేధిత జాబితాను వెంటనే ఎత్తేయాలి

(మొదటి పేజీ తరువాయి)

6 వేలకుపైగా భూములతో పాటు హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు.ఎలాంటి దరఖాస్తులూ తీసుకోకుండా, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత మంత్రిని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంత్రి చేసిన తప్పులపై ముఖ్యమంత్రి చర్యలు తీసుకోకపోతే ఇద్దరూ కలిసి కుట్రపూరితంగా భూదందాకు పాల్పడ్డారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయన్నారు. ఈ అంశంపై అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. తెలంగాణ భవన్‌లోని జనతా గ్యారేజీ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు అక్కడికి రావాలని సూచించారు.ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను నిలిపివేయాలని, 22ఏ నిషేధిత జాబితా నుంచి ఆస్తులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. 22ఏ నిషేధిత జాబితా విషయంలో ప్రభుత్వం రాత్రికి రాత్రే జీవోలు జారీ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, బద్దం పరుశు రాంరెడ్డి, వీరేష్‌యాదవ్, వెంకన్న, నందికంటి శ్రీధర్, ఖలీల్, కార్పొరేటర్ విజయశాంతి, రాము, సునీత యాదవ్, శిరీషారెడ్డి, జగదీష్‌గౌడ్, రామచందర్ యాదవ్, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ పామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు.

# బిఆర్ఎస్‌తో పోలిస్తే రెండింతలుగా భూ ఆక్రమణలు

(మొదటి పేజీ తరువాయి)

నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు, చివరకు ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని ఈటల మండిపడ్డారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక భూమాఫియాకు అప్పగించే కుట్ర ఉందని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసినప్పటికీ భూములను లాక్కునే ప్రభుత్వాల విధానంలో ఎలాంటి మార్పు రాలేదని ఈటల విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే భూములను సెటిల్‌మెంట్ చేసుకుంటోందని ఆరోపించారు. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఇలాంటి భూ దందాల ద్వారా వచ్చినవేనంటూ ఈటల సంచలన ఆరోపణలు చేశారు. గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ ద్వారా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని ఈటల పేర్కొన్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. పేదలు, రైతులకు అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ముకాయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూ అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం కొనసాగుతుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అయితే, ఈ సమావేశంలో ఈటల చేసిన ఆరోపణలపై ప్రభుత్వం లేదా సంబంధిత వర్గాల స్పందన వెలువడాల్సి ఉంది.

# ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

**హైదరాబాద్,ఆగస్టు 18 :** ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు... ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగు తున్నందున 'తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ' అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణెళి నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ÷ృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు.

# పెండింగ్ భూ సేకరణను పూర్తి చేయాలి కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాముతో కలిసి నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, పెద్దపల్లి బైపాస్ రోడ్డు, కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి భూ సేకరణను వేగవంతం చేయాలని సూచించారు. అక్టోబర్ 15 నాటికి కూనారం ఆర్‌ఓబీ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. భూ సేకరణలో జాప్యం లేకుండా రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేస్తూ, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. భూ యజమానులతో సమన్వయం చేస్తూ పరిహారం చెల్లింపులు, రికార్డుల పరిశీలన వంటి అంశాలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్, రెవెన్యూ డివిజనల్ అధికారి బి. గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 24 నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక ఆటో బంద్‌కు పిలుపు



పెద్దపల్లి, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ ఆటో యూనియన్ల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు మంద రవికుమార్ రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక ఆటో బంద్‌కు పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో డ్రైవర్ల ఆదాయం తీవ్రంగా తగ్గిందని, ఆర్థిక ఇబ్బందులతో 200 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఆటో సంక్షేమ బోర్డు, మెయింటెనెన్స్ భృతి, ఇళ్ల నిర్మాణం, ఆటో నగరాల ఏర్పాటు వంటి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ నెల 21న పెద్దపల్లిలో భారీ ఆటో ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు ప్రకటించారు. 24నుంచి నిరవధిక బంద్ ప్రారంభ మవుతుందని, సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆటో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్కే జబ్బర్, ఉపాధ్యక్షులు జెరుపోతుల కుమార్, జిల్లా కన్వీనర్లు ఎనగందుల నాంపల్లి, బండ సురేష్, బందారపు కుమార్, రామగుండం ఇంచార్జి మడిపెద్ద రమేష్, మంథని ఇంచార్జి మడ్డి నర్సయ్య, పెద్దపల్లి కన్వీనర్ యాదగిరి శంకర్, నా యకులు ఈర్ల శంకర్, గాండ్ల సత్యానంద్, కందుల నర్సింగ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు





పెద్దపల్లి/తిమ్మాపూర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించబడ్డాయి. తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో సర్పంచ్ ఎలుక అంజ నేయులు ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలు ప్రజల్లో ధైర్యం, ఆత్మవి శ్వాసం కల్పించాయని, కులమత భేదాలకు అతీతంగా సమాజంలో ఐక్యత కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. పాపన్న గౌడ్ సాధారణ కుటుంబంలో జన్మించి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని ప్రజల కోసం పోరాడిన గొప్ప యోధుడని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో మండల, గ్రామ స్థాయిలో కూడా అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెద్దపల్లి--మంథని ఫ్లైఓవర్ వద్ద జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పాపన్న గౌడ్ బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప యో ధుడని, ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత ఆయన చూపిన ధైర్యం, సామాజిక చైతన్యాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో గౌడ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జాతీయ రైతు పరిరక్షణ సమితి మత్స్యకారుల సంఘం అధ్యక్షుడిగా బొమ్మర వేణి మల్లేశం



గంగాధర, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలానికి చెందిన బొమ్మర వేణి మల్లేశం ముదిరాజ్‌ను ఉమ్మడి జిల్లా జాతీయ రైతు పరిరక్షణ సమితి మత్స్యకారుల సంఘం అధ్యక్షుడిగా నియమించినట్లు జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డి కరుణాకర్ రెడ్డి ప్రకటించారు. రైతు, మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని నాయకులు తెలిపారు.

# ప్రాథమిక పాఠశాలలో యూనిఫామ్‌ల పంపిణీ



హుస్నాబాద్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లను గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత--రాజు పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులందరూ సమానమే అనే నినాదంతో పాఠశాలల్లో ఉచిత దుస్తులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ సతీష్, మహిళా సంఘాల సీఏ వెన్న శ్రీనివాస్, దుస్తులు కుట్టిన వెన్న శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

# మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా మామిడి రాజు నియామకం



ఇల్లంతకుంట, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఇల్లంతకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా సర్పంచ్ మామిడి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో జరిగిన సమావేశంలో సర్పంచులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కలసి గ్రామాల్లోని సమస్యలను వివరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తరువాత ఫోరం అధ్యక్షుడి ఎంపికపై చర్చ జరగగా, ఎమ్మెల్యే సూచించిన మామిడి రాజు పేరును సర్పంచులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే ఇటీవల ప్యాక్స్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఊట్కూరి వెంకట రమణారెడ్డిని కూడా సత్కరించారు. మామిడి రాజు మాట్లాడుతూ సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కాత మల్లేశం, నేరెళ్ల విజయ్‌గౌడ్, బొల్లవేణి మంజుల-రమేశ్, అరుకాల నవీన్, ఒల్లాల రజిత-వెంకటేశం, చింతమడక కళ్యాణ, పండుగ సునిత-తిరుపతి, కాంపెల్లి నాగరాజు, పోతరాజు చంటి, జుట్టు శేఖర్, మేడిపెల్లి భాస్కర్‌రెడ్డి, గొడుగు విఠల్, మీసాల కనకరాజు, సింగిరెడ్డి రచన-వెంకటరెడ్డి, వంచ చంద్రారెడ్డి, ఎం.లావణ్య-రవి, నాయిని నవీన్‌కుమార్, చల్లా నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు




కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో గణేష్‌నగర్ అదితి బాంకెట్ హాల్లో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కరీం నగర్, జగిత్యాల, రాజన్న--సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు, అసోసియేషన్ ప్రతినిధులను సన్మానించారు. లేట్ లయన్ మైదం సత్యనారాయణ 2001లో ప్రారంభించిన ఫోటోగ్రాఫర్ల సత్కార సంప్రదాయం 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యత లభించింది. ఫోటోగ్రఫీ రంగానికి అంకితభావంతో సేవలందిస్తున్న వారిని గుర్తించి సత్కరించడం విశేషమైంది. ఈ కార్యక్రమానికి అదనపు డీసీపీ పి. వెంకట రమణ, టీజీపీపవా జనరల్ సెక్రటరీ సిరి రవి, చీఫ్ అడ్వైజర్ మహిమల క్యాదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లయన్ బొమ్మ పవన్ కుమార్ కార్యక్రమానికి ఛైర్మన్‌గా వ్యవహరించారు. లయన్ మైదం శివకాంత్, లయన్ బట్టు వినోద్, లయన్ మేతుకు చైతన్యతో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. సాగర్ ల్యాబ్ స్పాన్సర్‌గా సహకరించగా, నిర్వాహకులు లేట్ లయన్ మైదం సత్యనారాయణ సేవా దృక్పథాన్ని స్మరించారు. 25 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్‌కు గర్వకారణమని పేర్కొన్నారు.

# బైపాస్ డంపింగ్ యార్డ్‌ను నగరానికి దూరంగా తరలించాలని టీఆర్ఎస్ డిమాండ్



కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ నగర ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. బైపాస్ రోడ్డులో ఉన్న డంప్‌యార్డ్ కారణంగా చుట్టుపక్కల కాలనీల ప్రజలు దుర్వాసన, పొగ, దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోతిరాంపూర్, లక్ష్మీనగర్, కట్టరాంపూర్, కమాన్ ప్రాంతం, బస్టాండ్, అంబేద్కర్ స్టేడియం వరకు ప్రభావం చూపుతోందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన డంప్‌యార్డ్‌ను నగరానికి దూరంగా తరలించి బయోమైనింగ్ ద్వారా చెత్తను తొలగించాలని, భవిష్యత్తులో తడి--పొడి వ్యర్థాలను వార్డు స్థాయిలోనే వేరు చేసి శాస్త్రీయంగా ప్రాసెసింగ్ చేసే శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి ఆధ్వర్యంలో డంపింగ్ యార్డ్ వద్ద ధర్నా జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, కుతాడి శ్రీనివాస్, శ్రీరాముల రమేష్, రంగరవేణి లక్ష్మణ్, బుడిగె పర్వారం గౌడ్, నూతి చరణ్, బాసవేణి రాజేందర్, యండి రజీ, పుసాల పవన్, కొత్తూరి రఘు, యండి హుస్సేన్, మడిపల్లి వినీత్, అభిరామ్, విద్యాసాగర్, పవన్, సుత్తాల రాజన్నా, మహిళా నాయకులు యండి సల్మా, దాసరి అంజలి, దీటి శిరీష, కొరిమి పద్మ, కొలిపాక గౌతమి, కాంతాల రోజా రెడ్డి, కుతాడి రజిత, వరుణ్ యదవ్, గడ్డం రవికుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# యువతనుఓటు బ్యాంకుగా కాదు దేశ నిర్మాణ శక్తిగా చూడాలి




హుస్నాబాద్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): యువత, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర యువజన విధానాన్ని అమలు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర కోరారు. హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఏఐవైఎఫ్ సిద్దిపేట జిల్లా 3వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం యువజన ప్రదర్శన నిర్వహించారు. ధర్మేంద్ర మాట్లాడుతూ యువతకు నాణ్యమైన విద్య, శాశ్వత ఉపాధి, వైద్యం, నైపుణ్యాభివృద్ధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి వార్షిక నియామక క్యాలెండర్ ప్రకటించి పెండింగ్ పోస్టులను భర్తీ చేయాలని, జిల్లాల వారీగా పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. విద్యార్థుల ఫీజు సమస్యలు, పరీక్షల జాప్యం, ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టాలని, ప్రతి జిల్లాలో ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాలు, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో మాత్రమే యువతను ఓటు బ్యాంకుగా చూడకుండా దేశ నిర్మాణ శక్తిగా గుర్తించాలని అన్నారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించే ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# మేడిపల్లి మాల్ ఆమనగల్ ఆర్టీసీ బస్సు సేవలు పునఃప్రారంభం

- ఐదేళ్ల తర్వాత అందుబాటులోకి వచ్చిన బస్సు సర్వీసు.. ప్రజలకు ఊరట









ఆమనగల్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరోనా సమయంలో నిలిపివేసిన మేడిపల్లి--మాల్--ఆమనగల్ ఆర్టీసీ బస్సు సర్వీసులు ఐదేళ్ల తర్వాత మంగళవారం పునఃప్రారంభమయ్యాయి. దీంతో మేడిపల్లి, మాల్, పల్లెచెల్కతండా, ముద్విన్‌శెట్టిపల్లి, గౌరారం, సరికొండ, ఆకుతోటపల్లి, ఆమనగల్, తక్కలపల్లి తదితర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యను పరిష్కరించేందుకు మేడిపల్లికి చెందిన పీఆర్‌జీ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త పలుమార్లు ఆర్టీసీ ఎండీ, మహబూబ్‌నగర్ ఆర్టీసీ ఆర్ఎం, కల్వకుర్తి డిపో మేనేజర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. బస్సు సర్వీసును పునఃప్రారంభించాలని కోరుతూ నిరంతరం కృషి చేశారు. ఈ నేపథ్యంలో సరికొండ సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్, పీఆర్‌జీ ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్ గుప్త, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి బస్సుకు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ మహేందర్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లెచెల్కతండా, మేడిపల్లి, మాల్ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కడ్తాల్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీను నాయక్, మాజీ ఉపసర్పంచ్ సీతారాం నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. ఇటీవల కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ను కలిసి కరోనా సమయంలో రద్దయిన బస్సు సర్వీసులను పునఃప్రారంభించాలని కోరినట్లు తెలిపారు. వారి చొరవతో కల్వకుర్తి డిపో మేనేజర్‌తో మాట్లాడి మేడిపల్లి--మాల్--ఆమనగల్ బస్సు సర్వీసును పునఃప్రారంభించినట్లు పేర్కొన్నారు. బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రితో పాటు ఆర్టీసీ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తయినా బోయనగుట తండాకు ఇప్పటివరకు బస్సు సౌకర్యం లేకపోవడం బాధాకరమని, చరిత్రలో తొలిసారిగా తండాకు బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. బస్సు సర్వీసు కోసం పట్టు వదలకుండా కృషి చేసిన రవీందర్ గుప్తను పల్లెచెల్కతండా, ముద్విన్‌శెట్టిపల్లి, గౌరారం, సరికొండ, ఆకుతోటపల్లి, ఆమనగల్, మేడిపల్లి, మాల్, తక్కలపల్లి గ్రామాల ప్రజలు అభినందించారు. ఈ బస్సు సేవలను రైతులు, విద్యార్థులు, మహిళలు, యువత, ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మహేందర్ గౌడ్ కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బలవంత్, వార్డు సభ్యులు బాలమణి, నరసింహ, మంజుల, శ్రీను, కాంటేకర్ శ్రీను, వెంకటయ్య, మాజీ సర్పంచ్ కొత్తపెల్లి యాదమ్మ, పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య రౌతు, అద్దాల యాదయ్య, లక్ష్మయ్య, యాదయ్య, ఆలంపల్లి వెంకటయ్య, మహేష్, హరిచంద్ర, నరసింహ, జయారి, రాములు తదితరులతో పాటు పల్లెచెల్కతండా గిరిజన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

RNI - TELTEL/2023/87644

## ఓటరు తుది జాబితా వరకు బీఎల్ఏ-2లు క్షేత్రస్థాయిలో పనిచేయాలి



మానకొండూర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఎస్ఐఆర్ ఫేజ్-2 ప్రక్రియలో భాగంగా ఓటరు తుది జాబితా వెలువడే వరకు బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏ-2) క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేయాలని బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ఆంతోనీ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం సూచించారు. కరీంనగర్, మానకొండూర్ నియోజకవర్గాల్లో జరిగిన ప్రత్యేక సమావేశాల్లో వారు మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాలో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్ ఓట్లు అధికంగా ఉన్నాయని, ఓటర్లలో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో బీఎల్ఏ-2లు వారికి అండగా నిలిచి సహాయం చేయాలని అన్నారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం-7 ద్వారా అభ్యంతరాలు లేదా తొలగింపులు, ఫారం-8 ద్వారా వివరాల సవరణలు చేయాలని సూచించారు. ఎన్నికల అధికారుల నుండి నోటీసులు అందుకున్న ఓటర్లు సెప్టెంబర్ 16లోగా సరైన ఆధారాలతో స్పందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. జిల్లా ఇంచార్జీ హరిబాబు మాట్లాడుతూ అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానున్నందున అప్పటివరకు ప్రతి బూత్ స్థాయిలో పార్టీ ప్రతినిధులు అలర్ట్‌గా ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి



కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ కలిసి శంకుస్థాపన చేశారు. 20, 21వ డివిజన్లలో మున్సిపల్ నిధులతో సీసీ రోడ్లు, పైప్ డ్రెయిన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసి నాణ్యమైన రహదారులను అందుబాటులోకి తెస్తున్నామని వారు తెలిపారు. అనంతరం 16వ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో తాగునీటి పైప్‌లైన్ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు తాగునీటి సరఫరా మెరుగవుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని మేయర్ అధికా రులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, బండ రమణారెడ్డి, వంగల పవన్, బండారి వేణు, బోయిన్పల్లి ప్రవీణ్ రావు, గాజా రామ శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్‌తో పాటు అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు

## సామాజిక సమానత్వానికి పాపన్న పోరాటం మార్గదర్శకం



కరీంనగర్ /సిద్దిపేట/సుల్తానాబాద్/ హుజురాబాద్ ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా కరీంనగర్, సిద్దిపేట, సుల్తానాబాద్, హుజురాబాద్ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, గౌడ సంఘ నాయకులు పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమని, బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు శాతవాహన విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రధాన ద్వారం వద్ద జయంతి వేడుకలు నిర్వహించి పాపన్న ఆశయాలను స్మరించారు. హుజురాబాద్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్దిపేటలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా హాజరై పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన పోరాటం సామాజిక సమానత్వానికి మార్గదర్శకమని అన్నారు. సుల్తానాబాద్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో, అలాగే గొల్లపల్లి--నారాయణ రావుపల్లి గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. మాజీ ఎంపీటీసీ మొలుగూరి అంజయ్య పాపన్న ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, గౌడ సంఘ నాయకులు, విద్యార్థులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొని పాపన్న గౌడ్ సేవలను స్మరించారు.

## రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలి



కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు మండల సమీక్ష సమావేశాలు ఎంతో ఉపయోగకరమని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న అన్నారు. కరీంనగర్ రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ రైతులు వరి సాగుపై మాత్రమే ఆధారపడకుండా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వం ఆరుతడి పంటలపై ప్రత్యేక దృష్టి సారించిందని, సర్పంచులు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. అధిక లాభాలు అందించే ఆయిల్‌ఫామ్ సాగును పెద్ద ఎత్తున చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని నరసన్న పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి మార్కెట్ కమిటీ పూర్తి సహకారం అందిస్తుందని, ధాన్యం కొనుగోళ్లతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో షర్మిల, తహసీల్దార్ లక్ష్మీనరసింహారావు, ఎంపీడీవో అశోక్‌తో పాటు అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## బాధిత మహిళలకు న్యాయ సహాయంలో సఖి కేంద్రం ముందుండాలి



కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : గృహహింస నిరోధక చట్టం 2005 ప్రకారం పీసీఆర్ కోర్టులో ఫైల్ చేస్తున్న కేసులు పెండింగ్ లేకుండా చూడాలని, బాధితులకు న్యాయ సహాయం అందించడంలో సఖి కేంద్రం ముందుండాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. కరీంనగర్ సఖి సెంటర్‌లో జరిగిన 13వ మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రక్షణాధికారులు, ఐసిడిఎస్ సిడిపిఓల సమన్వయంతో కేసులను వేగంగా పరిష్కరించాలని అన్నారు. బాధిత మహిళలు, బాలికలకు అవసరమైన సహాయాన్ని అన్ని శాఖల సమన్వయంతో అందించాలని సూచించారు. జీవో ఎంఎస్ 28 ప్రకారం విక్టిమ్ కాంపెన్సేషన్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, వరకట్న వేధింపుల కేసుల వివరాలను పోలీస్ స్టేషన్ల నుండి సేకరించాలని ఆదేశించారు. కౌన్సిలింగ్‌లో భాగంగా న్యాయ సలహాల ద్వారా తీసుకున్న చర్యల రిపోర్టులు సమర్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా విద్యాధికారి చైతన్య జైనీ, మెప్మా పీడీ స్వరూప రాణి, డిఆర్డిఏ అధికారులు, మహిళా సంఘాలు, ఎన్జీవోలు, సఖి సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు న్యాయం చేయాలి ఎంపీ వంశీకృష్ణ



పెద్దపల్లి, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న 'మారు పేర్ల' సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే పవర్, ఫైనాన్స్ మంత్రిత్వ శాఖలకు లేఖలు రాసినట్లు, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. యాజమాన్యానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పరిష్కారం లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కార్మికులు ధర్నాలు, నిరసనలు, వినతిపత్రాల ద్వారా సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని, కోర్టు కేసులు ఉన్నాయంటూ పక్కదారి పట్టించడం సరికాదని ఎంపీ అన్నారు. "కార్మికుల చెమటతోనే దేశానికి వెలుగు. వారికి న్యాయం జరగకపోతే సింగరేణికే ఇబ్బందులు వస్తాయి" అని హెచ్చరించారు. స్వర్గీయ కాకా వెంకటస్వామి కార్మికుల హక్కుల కోసం చేసిన పోరాటాలను గుర్తు చేస్తూ, కార్మికుల సేవలను విస్మరించి అధికారుల నిర్ణయాలతో సంస్థను నడపడం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు. సింగరేణి సంస్థ దేశానికి కీలకమని, "సింగరేణి నడిస్తేనే దేశానికి వెలుగు" అని పేర్కొంటూ, మారు పేర్ల సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎంపీ వంశీకృష్ణ మరోసారి కోరారు.

## ఎస్సీ సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలి కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఎస్సీ యాక్షన్ ప్లాన్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో 297 మంది లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 192 మందిని ఎంపిక చేసి, వారిలో 117 మందికి బ్యాంకు ఖాతాలు ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేసి, సబ్సిడీ మొత్తాన్ని క్లెయిమ్ చేసేందుకు నాన్-ఆపరేటివ్ ఖాతాలు ప్రారంభించాలని ఆదేశించారు. పీఎం అజయ్ పథకం కింద ఎస్సీ రైతులకు బోర్‌వెల్స్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హులైన వారికి ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు అర్హులైన విద్యార్థులందరూ సకాలంలో దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, ఒక్క విద్యార్థి కూడా స్కాలర్‌షిప్‌కు దూరం కాకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతులు చేసి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, ప్రభుత్వం నిర్దేశించిన డైట్‌ను తప్పనిసరిగా అందించాలని సూచించారు. విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, వసతి గృహాల నిర్వహణలో లోపాలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రవణ్ కుమార్, డీఎస్‌సీడీవో రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థి సంఘాల ఆందోళన



దేవరకొండ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న భాస్కర్ బాలికల పట్ల అసభ్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం బీఆర్ఎస్వీ, ఏబివిపి, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ధర్నా జరిగింది. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, "విద్యార్థినుల భద్రతకు భంగం కలిగించేలా వ్యవహరించిన లెక్చరర్‌ను వెంటనే సస్పెండ్ చేసి, ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి. ఆరోపణలు నిజమని తేలితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. అలాగే భాస్కర్‌పై పోలీస్ కేసు నమోదు చేసి విద్యార్థినులకు న్యాయం చేయాలని కోరారు. కళాశాలలో విద్యార్థినులకు సురక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందని, ఈ ఘటనపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించాలని విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, ఎబివిపి నాయకుడు గోపీచంద్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు బుడిగ వెంకటేష్, ముదిగొండ హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ పనులు వేగవంతం చేయాలి ఎమ్మెల్యే కవ్వంపల్లి



గన్నేరువరం, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : గన్నేరువరం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పనులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. భవనంలోని గదులను పరిశీలించి అధికారుల నుండి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైద్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొ న్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేసి, పీహెచ్‌సీని త్వరితగతిన ప్రజ లకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. వైద్యులు, సిబ్బందికి అవస రమైన సౌకర్యాలు కల్పించి, రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భవనాన్ని పూర్తి చేయా లని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాజగోపాల్, కాం గ్రెస్ నాయకులు పులి కృష్ణ, కొమ్మెర రవీందర్ రెడ్డి, పరిపూర్ణచారి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా క్రీడలు నిర్వహించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి



కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రాష్ట్రంలో జరగనున్న ఖేలో ఇండియా క్రీడల్లో రెజ్లింగ్, జూడో, యోగా పోటీలను కరీంనగర్‌లో నిర్వహించాలని జిల్లా ఒలింపిక్ సంఘం ప్రతినిధులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజ య్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో అంబేద్కర్ స్టేడియం, ఇండోర్ క్రీడా సదుపాయాలు, క్రీడాకారులకు తగిన వసతి సౌకర్యాలు ఉన్నందున నిర్వహణకు అనుకూలమని ప్రధాన కార్యదర్శి జి. జనార్దన్ రెడ్డి, ఉపా ధ్యక్షులు తుమ్మల రమేష్ రెడ్డి, కోశాధికారి ఎన్. సిద్ధారెడ్డి తెలి పారు. ఖేలో ఇండియా పోటీలతో ఈ ప్రాంతంలో క్రీడలపై మరింత అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం డాక్టర్ వి. నరేందర్ రెడ్డి




కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా కార్యక్రమం ఘనంగా జరిగింది. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి నేతాజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించారు. యువత నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చూపిన దేశభక్తి, ధైర్యం నేటికీ స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్ ద్వారా యువతను సైన్యంలో పాల్గొ నేలా ప్రోత్సహించి దేశభక్తిని పెంపొందించిన నేతాజీ త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొ న్నారు .కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి గేయాలు ఆలపించగా, చిన్నారులు నేతాజీ వేషధారణలో పాల్గొని దేశభక్తిని చాటారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

## గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్‌కే గార్డెన్స్‌లో ఎంపీడీఓ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో 30 గ్రామాల సర్పంచులు, అధికారులు కలిసి విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్‌డబి, వ్యవసాయ శాఖ, మిషన్ భగీరథ వంటి అంశాలపై చర్చించారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి సర్పంచుల సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. విద్యాభివృద్ధికి 16 కోట్ల నిధులు ఖర్చు చేస్తామని, కొత్త పాఠశాల భవనాలు, మరమ్మతులు, కాంపౌండ్ వాల్స్, టాయిలెట్స్ నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని సర్పంచులను కోరారు. రాబోయే సమావేశానికి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతంలో బీఎల్ఏ-2లు, సూపర్వైజర్లదే కీలక పాత్ర



కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బి.ఎల్.ఏ-2) మరియు సూపర్వైజర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో బి.ఎల్.ఏ-2లు, సూపర్వైజర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలోని ఓటర్ల సమస్యలను తెలుసుకుని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, వాటి ప్రయోజనాలను వివరించాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహిస్తూ ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, మున్సిపల్ కార్పొరేటర్లు, మహిళా నాయకులు, బి.ఎల్.ఏ-2లు, సూపర్వైజర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరద కాలువ భూములకు నష్టపరిహారం పెంచాలని బీఆర్ఎస్ డిమాండ్



హుస్నాబాద్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గౌరవెల్లి ప్రాజెక్టు వరద కాలువల కోసం రైతుల భూములు కోల్పోతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారం తక్కువగా ఉందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. హుస్నాబాద్, అక్కన్నపేట్ మండలాల్లో ఎకరానికి 13 లక్షలు, కోహెడ మండలంలో 11 లక్షలు పరిహారం ఇస్తామని అధికారులు వెల్లడించినా, ప్రస్తుత భూమి ధరలు కనీసం 30 లక్షల వరకు ఉన్నాయని రైతులు పేర్కొన్నారు. కొద్దిపాటి భూములతో జీవనం సాగిస్తున్న రైతులు కాలువల కోసం భూములు కోల్పోతే ఎలా బ్రతుకుతామని ప్రశ్నించారు. రైతుల త్యాగాలను గుర్తించి నష్టపరిహారం పెంచాలని, ఈ అంశాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ సమావేశంలో అయిలేని మల్లికార్జున రెడ్డి, చిత్తరి శ్రీనివాస్, ఇంద్రాల సారయ్య, యాస శ్రీనివాస, కొమ్మెర నర్సింహా రెడ్డి, భూక్యా రాజు నాయక్, గుగులోతు తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో మానేరు వంతెనపై ఉన్న విగ్రహానికి చైర్మన్ పులి ఆంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పాపన్న గౌడ్ బహుజనుల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడని, రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రంలో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసి భావితరాలకు ఆయన చరిత్రను పరిచయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 15వ డివిజన్ చింతకుంటలోని విగ్రహానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఔరంగజేబును ఎదిరించి గోల్కొండను పాలించిన పాపన్న గౌడ్ బహుజన చైతన్యానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కూడా జయంతి వేడుకలు జరిగాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం కలిసి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిని మల్లేశం మాట్లాడుతూ పాపన్న గౌడ్ నిరంకుశ పాలకులను ఎదిరించి సామాన్య ప్రజల సంక్షేమం కోసం పోరాడిన ధీశాలి అని కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, సంఘ ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్లేట్, గ్లాస్‌ల పంపిణీ



కరీంనగర్ రూరల్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : బొమ్మకల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్, గ్లాస్‌ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. టీ మొబైల్స్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మ్యకల వెంకటేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ వి.ఓ.జీ. అనిత, పి. శ్రీధర్, హెడ్‌మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు గీతతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులందరికీ స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అంద జే యగా పిల్లలు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం దాతలకు కృతజ్ఞతలు తెలిపింది.

# కోతుల మృతికి నివాళులర్పించిన స్థానికులు



సుల్తానాబాద్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఈ నెల 5న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోతుల జ్ఞాప కార్థంగా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి లోని 12వ వార్డులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ అమిరిశెట్టి శ్రావణి--రాకేష్ ఆధ్వర్యంలో శాస్త్రినగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి, కోతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించగా సుమారు 300 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిరి మహేందర్, ముస్త్యాల రవీందర్, కం దుకూరి పెద్దన్న, అమిరిశెట్టి తిరుపతి, అమిరిశెట్టి రాజలింగం, వేగోలం అబ్బయ్య గౌడ్, కుమార్ కిషోర్, కల్వల ఓదెలు, గుండేటి దేవేందర్, ఈర్ల శేఖర్, దొడ్ల సందీప్, నయీమ్, పెగడ పరుశు రాములు, ఎల్ల రాజు, సమీర్, కన్నం చైతన్యతో పాటు మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యార్థిపై మద్యం సీసాలతో దాడి చేసిన ఇద్దరు నిందితుల అరెస్ట్

కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థిపై బీర్ బాటిల్, మద్యం సీసాలతో దాడి చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి గ్రామానికి చెందిన మాయ మహేష్ కరీంనగర్‌లో నివాసం ఉంటూ ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఈ నెల 16న రాత్రి గదిలో జరిగిన వివాదంలో బూడిద నవీన్ గౌడ్, కమ్మరి నవీన్ కుమార్ కలిసి మహేష్‌పై దాడి చేశారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. వన్ టౌన్ సీఐ రామ్ చందర్ రావు తెలిపారు, కేసు నమోదు చేసి నిందితులను ఎస్సై రాజన్న అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారని. విద్యార్థులు మద్యం, గొడవలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకోవాలని, క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని పోలీసులు హెచ్చరించారు.

CHANGE OF NAME

I , **KOLAZHI RAMAKRISHNAN VINAYAKUMAREN** Residing at Hno : 1-10-372,flat - 405b, Solankis Gulmohar Apts Brahmanwadi, Begumpet, Hyderabad, Pin: 500016 , Telangana, India here by declare that I have changed my name from **KOLAZHI RAMAKRISHNAN VINAYAKUMAREN** to **KOLAZHI RAMAKRISHNAN VINAYAN** S/o late RAMAKRISHNAN for future purposes.

CHANGE OF NAME

I , **THAZHATH MAVARI RANITHA** Residing at Hno : 1-10-372,flat - 405b, Solankis Gulmohar Apts Brahmanwadi, Begumpet, Hyderabad, Pin: 500016 , Telangana, India here by declare that I have changed my name from **THAZHATH MAVARI RANITHA** to **THAZHATH MAVALI RANITHA** D/o KELOTH NEELAKANDAN NAIR for future purposes.

# గణేష్ మండపాలకు ఉచిత కరెంట్ ప్రకటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసే గణేష్ మండపాలన్నింటికీ ఉచితంగా విద్యుత్ అందజేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. మండపాల కరెంట్ బిల్లుల మొత్తాన్ని కార్పొరేషన్ భరించనుందని తెలిపారు. గత మూడేళ్లుగా ఈ బిల్లులను తన సొంత నిధులతో చెల్లించగా, ఈసారి బీజేపీ మేయర్ పీఠం దక్కిన నేపథ్యంలో కార్పొరేషన్ బాధ్యత వహించనుందని చెప్పారు. పర్యటనలో భాగంగా 21వ డివిజన్ విద్యానగర్, శ్రీరాంనగర్ కాలనీల్లో కోటి రూపాయల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం 16వ డివిజన్ లక్ష్మీపూర్, మల్కాపూర్ కాలనీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.15 లక్షల వ్యయంతో తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.22,000 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని, అందులో రూ.5,000 కోట్లతో జాతీయ రహదారులు నిర్మించామని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం 100 రోజుల్లోనే రూ.840 కోట్ల యూసిఎఫ్ నిధులు, స్మార్ట్ సిటీ కింద రూ.940 కోట్ల నిధులు తెచ్చినట్లు వివరించారు. అభివృద్ధి, పండుగల నిర్వహణలో కరీంనగర్‌ను తెలుగు రాష్ట్రాల్లో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# మార్కెటింగ్ శాఖలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నార మనోహర్ సేవలకు ఘన సన్మానం



సుల్తానాబాద్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో ప్రత్యేక శ్రేణి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నార మనోహర్ సేవలు అభినందనీయమని మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు అన్నారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయనకు ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించింది. అనంతరం సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో డైరెక్టర్లు, రైస్ మిల్లర్లు, ట్రేడర్లు, సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. ప్రకాష్ రావు మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు మార్కెట్ కమిటీ ఆదాయం పెంపునకు నార మనోహర్ చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ఆయన సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. నార మనోహర్ మాట్లాడుతూ తనకు లభించిన గుర్తింపుకు చైర్మన్, పాలకవర్గం, సిబ్బంది, రైస్ మిల్లర్లు, ట్రేడర్లు, హమాలీలు, రైతుల ప్రోత్సాహమే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ ఉస్తేం గణేష్, రైస్ మిల్లర్ల సంఘం నాయకులు, డైరెక్టర్లు, ట్రేడర్లు, సిబ్బంది, హమాలీలు, రైతులు పాల్గొన్నారు.

# జూలై నెల నేర సమీక్ష సమావేశం




కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో జూలై నెల నేర సమీక్ష సమావేశాన్ని సీపీ గౌష్ ఆలం అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో నేరాల నియంత్రణ, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారం, మహిళలు--చిన్నారులపై నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సీపీ మాట్లాడుతూ నేరం జరిగిన వెంటనే శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా అధికారులు, ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు నగదు రికవరీ వేగవంతం చేయాలని, మాదకద్రవ్యాలు, గుట్కా, పేకాట, అక్రమ ఇసుక రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనల అమలుతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జూలై నెలలో 15 ప్రధాన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా ప్రాసిక్యూషన్ విజయవ ంతంగా పనిచేసిందని సీపీ తెలిపారు. ఇందులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దశరథ్ 6 కేసులు, పీపీ ప్రతాప్ 5 కేసులు, అసిస్టెంట్ పీపీ రంజిత్ కుమార్, వీరస్వామి చెరో 2 కేసులు, గాయత్రి 1 కేసులో శిక్షలు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సేవలను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో అదనపు డీసీపీ వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కృష్ణమూర్తి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం



సిద్దిపేట, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు. ఐడీఓసీలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సర్పంచులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, ఫంక్షన్ హాళ్లు, దేవాలయాల్లో వధూవరుల వయస్సు ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. పాఠశాలలకు విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరు కాకపోతే కారణాలను ఉపాధ్యాయులు గుర్తించాలని, అర్హులైన కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. గ్రామస్థాయి కమిటీల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి బాల్య వివాహాలపై పర్యవేక్షణ చేపట్టాలని, ప్రతి మూడు నెలలకు జిల్లా స్థాయి సమావేశం జరగాలని కలెక్టర్ సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల సమయంలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కల్పించాలని, ప్రతి పాఠశాలలో చట్టం--2006, పిల్లల హక్కుల పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రవణ సందేశం, గోడ పోస్టర్లను ఆవిష్కరించి, అధికారులు, సిబ్బందితో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రమేష్, డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ధనరాజ్, జిల్లా సంక్షేమ అధికారి శారద, డీపీఓ రవీందర్, వనరుల వ్యక్తి అందె వెంకటేశ్వర్లు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికార సాధనకు పాపన్న ఆశయాలు మార్గదర్శకం



దేవరకొండ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు, మహిళలు, కార్మికులు, కర్షకులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ రంగాల్లో కృషి చేసిన సామాజిక కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, “బహుజనులు రాజ్యాధికార సాధన కోసం పోరాడాలి. సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధన కోసం కృషి చేయాలి. ఆయన భారతదేశ తొలి స్వాతంత్ర్య ఉద్యమకారుడు, తొలి బహుజన సామ్రాజ్య స్థాపకుడు. గోల్కొండతో పాటు 18 దుర్గాలకు రాజుగా పాలించిన బహుజన చక్రవర్తి” అని కొనియాడారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకమై బహుజన రాజ్యాధికార సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, చోల్లేటి భాస్కరాచారి, డాక్టర్ ఏకుల రాజారావు, ఉప్పల శీను నేత, దబ్బీకార్ పెంటోజి, ఏరుకొండల రాము, మునగాల గణేష్, పున్న బిక్షమయ్య, ముక్కామల బాలయ్య, శవ్వ నారాయణ యాదవ్, పోతాం సహదేవ్, కుంభం బాలచందర్ గౌడ్, ఇంద్రకంటి ఈదయ్య గౌడ్, నాగిళ్ల క్రిష్టఫర్, బోయపల్లి చంద్రమౌళి, ఏకుల సురేష్, ఎండి అబ్దుల్ సత్తార్, అబ్దుల్ కలాం, తోటపల్లి శీను, రాచమల్ల నాగయ్య, కానుగుల చంద్రశేఖర్, కాటం గోవర్ధన్, ఎరుకల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ,భూమి పూజ చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నల్లగొండ,ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నల్గొండ పట్టణంలో సిసి రోడ్లు, డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్, తాగునీరు, విద్యుత్, పార్కులు ఇలా అన్ని సదుపాయాలను కల్పించి సమస్యలు లేని పట్టణంగా, తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.
మంగళవారం ఆయన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లో 23 కోట్ల 85 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమి పూజ చేశారు.ఇందుగా మంత్రి 3 వ డివిజన్లో షెడ్యూల్ తెగల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీ నుండి శేషమ్మ గూడెం మీదుగా, అద్దంకి రహదారి వరకు 9 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి, రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పానగల్ సమీపంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుండి డీఈఓ కార్యాలయం వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర వన్ టైం ఇంప్రూవ్మెంట్ కింద 14.45 కోట్ల రూపాయలతో చేపట్టనున్న రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బి చంద్ర శేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఉప మేయర్ అష్రఫ్ అలీ మహమ్మద్ మూడవ డివిజన్ కార్పొరేటర్ పేర్ల మల్లేశ్వరి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

## బహుజన యుద్ధ వీరుడు పాపన్న పోరాట స్ఫూర్తి



నల్లగొండ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):బహుజన యుద్ధ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయం అని సిపిఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అన్నారు.మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి సందర్భంగా పట్టణంలోని 11వ డివిజన్ కతాల్ గూడెంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ, "భూస్వాములు, సామంత రాజులపై తిరుగుబాటు జెండా ఎగురవేసి సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప వీరుడు పాపన్న. ఆయన పోరాట స్ఫూర్తితోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళనలు చేయాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యురాలు దండెంపల్లి సరోజ, 11వ డివిజన్ శాఖ కార్యదర్శి పనస చంద్రయ్య, శాఖ సభ్యులు దండెంపల్లి యాదయ్య, మారయ్య, అంజయ్య, కేశయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఉపయోగపడే వైకుంఠ రథాన్ని అందుబాటులోకి తేవాలి



జమ్మికుంట, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఎంపీడీఓ కార్యాలయం పక్కన సంవత్సరాలుగా వైకుంఠ రథం నిరుపయోగంగా ఉండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రజలకు అత్యవసర సమయంలో ఉపయోగపడాల్సిన రథాన్ని ఇలా పక్కన పెట్టడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అంత్యక్రియల సమయంలో వైకుంఠ రథం ఎంతో ఉపయోగకరమని, అందువల్ల దాన్ని వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.వైకుంఠ రథాన్ని ప్రజా సేవకు అందుబాటులోకి తీసుకురావాలని బిఆర్ఎస్ యూత్ నాయకుడు బండారి ప్రశాంత్, వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ 3వ వార్డు సభ్యుడు డిమాండ్ చేశారు.

## మార్కెట్ యార్డుల సమస్యలపై ఏఎంసీ ఫోరం వినతి



కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : తెలంగాణ రాష్ట్ర ఏఎంసి ఫోరం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనసాగుతున్న సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, రాష్ట్ర ప్రతినిధులు కలిసి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌ను కలిసి సమస్యలను వివరించారు.మార్కెట్ యార్డుల్లో ఉన్న అపరిష్కృత సమస్యలను త్వరితగతిన పరిష్కరించి రైతులకు సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు.

## "ప్రజా యుద్ధ నౌక గద్దర్" డాక్యుమెంటరీ పోస్టర్ విడుదల




నల్లగొండ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా "ప్రజా యుద్ధ నౌక గద్దర్" డాక్యుమెంటరీ పోస్టర్ విడుదలైంది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గద్దర్ ప్రజా ఉద్యమాలకు చిరునామా, పీడిత ప్రజల గొంతుక. ఆయన ఆట, పాటలతో కోట్ల మందిని ఉద్యమం వైపు నడిపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరు మీద గద్దర్ సినీ అవార్డులు అందిస్తోంది" అని గుర్తుచేశారు.గద్దర్ కుమార్తె వెన్నెల రూపొందిస్తున్న ఈ డాక్యు మెంటరీకి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. "గద్దర్ ఆశయాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు చేరేలా కృషి చేయడం అందరి బాధ్యత" అని పేర్కొన్నారు.

## నేతాజీకి ఘన నివాళి



నల్లగొండ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ప్రజా హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యక్రమంలో ఘన నివాళులు అర్పించారు.సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుగమల్ల షాలెమ్ రాజు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కలకుంట్ల వినోద్ చారి, నాగరాజు, రమేష్, కార్తీక్, బన్నీ సూర్యనారాయణ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించాలి



ఎలిగేడు, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని కూనారం ప్రధాన శాస్త్రవేత్త సతీష్ చంద్ర సూచించారు.ఎలిగేడు రైతు వేదికలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, "ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, వివిధ కషాయాలు, జీవన ఎరువులు తయారు చేసుకుని వినియోగిస్తే నేల ఆరోగ్యం కాపాడుతూ సేంద్రీయ పంటలు ఉత్పత్తి చేయవచ్చు" అని వివరించారు.వ్యవసాయ అధికారి ఏవో ఉమాపతి మాట్లాడుతూ, ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల విత్తనాలను నమోదు చేసుకుంటే రైతులకు రూ.500 బోనస్ లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్, శాస్త్రవేత్త సాయిరాం, ఏఈఓ సురేష్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్వాయి పాపన్న జయంతి





ఎలిగేడు, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మండలంలోని ర్యాకల్దేవుపల్లి, ధూళికట్ట, నర్సాపూర్ తో పాటు పలు గ్రామాల్లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. "బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన గొప్ప యోధుడు పాపన్న. ఆయన ధైర్యసాహసాలు, సమానత్వం కోసం చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకం" అని నాయకులు కొనియాడారు.ఈ కార్యక్రమాల్లో సర్పంచులు మద్దెల రమాదేవి–సంపత్, కొమురయ్య, కార్యదర్శులు అశోక్, అజ్మీర జ్యోతి, ధూళికట్ట గౌడ సంఘం అధ్యక్షుడు భూసారపు నర్సయ్య గౌడ్, వార్డు సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, నాయకులు రంగు కొమురయ్య గౌడ్, రంగు శ్యాం గౌడ్, కొయ్యడ శ్రీకాంత్, కోటగిరి పరుశరాములు, పూదరి రాము, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## లాలపల్లిలో నీటి కుంటల నిర్మాణ పనులు ప్రారంభం



ఎలిగేడు, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జలసిరి కార్యక్రమంలో భాగంగా ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలో నీటి కుంటల (ఫాం పాండ్) నిర్మాణ పనులను సర్పంచ్ ఏలేటి వెంకట్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన రైతులు ముందుకు వచ్చి ఫాం పాండ్‌లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్, టీఏ రంజిత్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

## 80 నిమిషాల నాన్‌స్టాప్ స్కేటింగ్ మారథాన్






ఇబ్రహీంపట్నం, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మన్నెగూడలోని ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్ వేదికగా కేహెచ్ భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో 80 నిమిషాల నాన్‌స్టాప్ స్కేటింగ్ మారథాన్‌ను ఘనంగా నిర్వహిం చారు. చిన్నారులు, యువ స్కేటర్లు ఉత్సాహంగా పాల్గొని 80 నిమిషాల పాటు నిరంతరాయంగా స్కేటింగ్ చేస్తూ తమ ప్రతిభను చాటుకు న్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వారిని అభినందించారు. కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకుడు పొలమోని శ్రీకాంత్‌ను ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.స్కేటింగ్ క్రీడను ప్రోత్సహించడంతో పాటు యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడతాయని నిర్వాహకులు తెలిపారు .80 నిమిషాల నాన్‌స్టాప్ స్కేటింగ్ మారథాన్‌ను విజయవంతం చేసిన ప్రతి క్రీడాకారుడు, తల్లిదండ్రులు, కోచ్‌లు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుపతయ్య గౌడ్ కుటుంబానికి ఎమ్మెల్యే కసిరెడ్డి పరామర్శ



ఆమనగల్లు, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వల్లపుదాసు తిరుపతయ్య గౌడ్ తండ్రి వార్ధక్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆకుతోటపల్లికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, అవసరమైన సమయంలో తన సహకారం అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, వార్డు సభ్యులు బాలు, నాయకులు బిచ్యా నాయక్, మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొని మృతుడికి నివాళులర్పించారు.

## ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



వెల్దండ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వెల్దండ మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ, "బహుజనుల ధీరత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్" అని కొనియాడారు. వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, "సాధారణ కుటుంబంలో పుట్టి తెలంగాణలో మొట్టమొదటి బహుజన రాజ్యాన్ని స్థాపించిన యుద్ధ వీరుడు పాపన్న" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మదన్ గౌడ్, మట్ట విష్ణు గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు భరత్ గౌడ్, శ్రీను గౌడ్, సామెల్, జంగయ్య, తిరుపతి రెడ్డి, లక్ష్మణస్వామి తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## టవర్ సర్కిల్‌లో ఫుడ్ షాపుల తనిఖీలు



కరీంనగర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ సీపీ గౌస్ ఆలమ్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు టవర్ సర్కిల్‌లోని ఫుడ్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో రాజా టీ స్టాల్‌లో వినియోగిస్తున్న వంట నూనె నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేదని అధికారులు గుర్తించారు. నాణ్యత లేని నూనెతో తయారైన తినుబండారాలను తొలగించి, తదుపరి చర్యల కోసం నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు.ప్రజల ఆరోగ్యాన్ని హాని చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సతీష్ హెచ్చరించారు.ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు సురేందర్, శ్రీకాంత్, ఫుడ్ సేఫ్టీ అధికారులు అంకిత్ రెడ్డి, రోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉషోదయ హైస్కూల్‌లో షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహణ



పెద్దపల్లి, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రామగుండం సీపీ ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ గోదావరిఖని రమేష్ నగర్‌లోని ఉషోదయ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించింది.షీ టీమ్ ఇంచార్జి ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ గుడ్ టచ్--బాడ్ టచ్, టీనేజ్ సమస్యలు, తెలియని వారి పట్ల జాగ్రత్తలు, పోక్సో యాక్ట్, సోషల్ మీడియా ప్రభావం, విద్యార్థుల ప్రవర్తన నియమావళి గురించి వివరించారు. మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థులు వేధింపులకు గురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ప్రమాదం లేదా బెదిరింపులు ఎదురైతే వెంటనే 100/112 నంబర్లకు, ఆన్లైన్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రయాణ సమయంలో టీ - సేఫ్ యాప్ వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక పాల్గొన్నారు.

## బీఎల్‌ఏలకు దాసరి మనోహర్ రెడ్డి దిశానిర్దేశం




పెద్దపల్లి, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎస్ఐఆర్‌లో భాగంగా విడుదలైన డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను ప్రతి బూత్ స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సూచించారు. మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన బీఎల్‌ఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హత ఉన్నప్పటికీ పేరు జాబితాలో లేకపోవడం, వివరాల్లో తప్పులు, చిరునామా మార్పులు ఉన్నవారిని గుర్తించి వారికి సహాయం చేయాలని అన్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు వంటి అర్హులైన ఓటర్ల పేర్లు తప్పకుండా జాబితాలో ఉండేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.ఫారం--6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఫారం--7 ద్వారా అభ్యంతరాలు, ఫారం--8 ద్వారా సవరణలు చేయాలని సూచించారు. "ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీఎల్‌ఏలతో పాటు మండల, పట్టణ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో సోషల్ ప్రాజెక్టుల మేళా





ఖానాపూర్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులలో సామాజిక అంశాలపై అవగాహన పెంచే లక్ష్యంతో సోషల్ ప్రాజెక్టుల మేళా ఘనంగా జరిగింది.విద్యార్థులు విక్రమ్ రాకెట్ మోడల్, భూమి అంతర్గత నిర్మాణం, అటవీ పరిరక్షణ, వాతావరణ విస్తరణ, అక్షాంశాలు--రేఖాంశాలు, సౌర కుటుంబం, మహాసముద్ర భూతల స్వరూపం, అగ్నిపర్వత నిర్మాణం వంటి ప్రాజెక్టులను ప్రదర్శించి సందర్శకులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయుడు జాడి శ్రీనివాస్, గైడ్ టీచర్లు రాపర్తి కిషన్ ప్రసాద్, వెన్నం అంజయ్యతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మర్రిగూడలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు



మర్రిగూడ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దూది రాజు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో "నషా ముక్తి భారత్ అభియాన్" లో భాగంగా మత్తు పదార్థాల వ్యతిరేక జాతీయ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు అర్థం చేసుకోవాలి. చదువుపై శ్రద్ధ పెట్టినట్లయితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు" అని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో మర్రిగూడ ఎస్సై బి. రాంబాబు, పోలీస్ సిబ్బంది ప్రశాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు మైసమ్మ బోనాల ఏర్పాట్లపై సమీక్ష



బోడుప్పల్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఈ నెల 23న జరగనున్న బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం ఆలయంలో మాజీ మేయర్ తోట కూర అజయ్ కుమార్ యాదవ్, బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ, మేడిపల్లి సీఐ జలేందర్ రెడ్డి కలిసి పరిశీలించారు.మాజీ మేయర్ మాట్లాడుతూ, "పండుగలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలి" అని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్, కొత్త కిషోర్ గౌడ్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, రాసాల వెంకటేష్ యాదవ్, దానగాళ్ళ యాదగిరి, చిరాల నర్సింహా, ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు డిమాండ్



నల్లగొండ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మిషన్ భగీరథలో మంచినీరు సరఫరా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26,000 నిర్ణయించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం నల్లగొండలో జరిగిన తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "శాశ్వత స్వరూపం కలిగిన పనుల్లో కాంట్రాక్టు విధానం ఉండకూడదు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మంచినీటి సరఫరా విభాగం శాశ్వతమైనది కాబట్టి కార్మికులను పర్మినెంట్ చేయాలి" అని అన్నారు.అలాగే రెండవ పిఆర్సి ప్రకారం కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, హెల్త్ కార్డులు, ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల సమయంలో ఎలాంటి నష్టపరిహారం లేక కుటుంబాలు అనాధలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వేతన ఒప్పందాలు జరగాలని, ఏప్రిల్ నుండి పెరగాల్సిన వేతనాలు ఇప్పటికీ పెంచకపోవడం దురదృష్టకరమని, కాంట్రాక్టర్లు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్ళాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షులు జంజరాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కుడుతాల సైదులు, కోశాధికారి ఉయ్యాల మురళి, సభ్యులు శంకర్, కిరణ్, సైదులు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రాథమిక విద్య' చిత్రానికి ప్రత్యేక బహుమతి



నల్లగొండ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో 'ప్రాథమిక విద్య' అంశంపై తీసిన చిత్రంకి ది హాన్స్ ఇండియా ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక బహుమతికి ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈ నెల 23న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో అందుకోనున్నారు.జుఅదేవిధంగా కర్ణాటక మీడియా సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఆయన తీసిన మరో చిత్రం ఉత్తమ వార్తా చిత్రంగా ఎంపికైంది. వరుసగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు సాధిస్తున్న శ్రీనివాస్ గౌడ్‌ను పలువురు అభినందించారు.

# డ్రగ్స్ సరఫరాను అరికట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశాలు



నల్లగొండ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):జిల్లాలో డ్రగ్స్ సరఫరా పూర్తిగా అరికట్టాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన నషా ముక్త్ భారత్ అభియాన్ – – డ్రగ్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ప్రతి అధికారి బాధ్యతతో పనిచేస్తూ డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి. నిరంతరం నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించాలి" అని సూచించారు.అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా విద్యాసంస్థలపై దృష్టి సారించాలని ఆదేశించారు. మెడికల్ కాలేజీలు, కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రతి పాఠశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేయాలి. పాఠశాలల పరిసరాల్లో పాన్ షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలి. హైస్కూల్ విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలి అని అన్నారు.ప్రభుత్వ హాస్టళ్లలో వార్డెన్లు ప్రత్యేక బాధ్యత తీసుకుని విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్ ఎక్కువగా సరఫరా అయ్యే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టి తరచూ తనిఖీలు చేయాలని, మున్సిపల్ అధికారులు కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, డ్రగ్స్ అధికారులు మెడికల్ షాపులను తనిఖీ చేయాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రదేశాల్లో పొగతాగకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి చట్టప్రకారం జరిమానా విధించాలని ఆయన స్పష్టం చేశారు.

# తాసిల్దార్ కార్తీక్ కుమార్ కు ఘన సన్మానం



వెల్దండ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఉత్తమ తాసిల్దార్ అవార్డు పొందిన కార్తీక్ కుమార్ను చెర్కూర్ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.సర్పంచ్ మాట్లాడుతూ, "ప్రజలకు అంకితభావంతో సేవలు అందిస్తూ ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందడం అభినందనీయమైన విషయం" అని అన్నారు. తాసిల్దార్ కార్తీక్ కుమార్ మాట్లాడుతూ, "ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది. ప్రజా సమస్యల పరిష్కారానికి పారదర్శకంగా కృషి చేస్తాను" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భీమయ్య గౌడ్, ఉప సర్పంచ్ కొండల్, వార్డు సభ్యులు పురుగుల లాలయ్య, సామ కుమారస్వామి, గొర్రె జంగయ్య, కేశమోని జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# 5వ వార్డుపై మున్సిపల్ అధికారుల దృష్టి ఎప్పుడు?

**– డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్య సమస్యలతో కాలనీవాసుల అవస్థలు**



ఆమనగల్లు, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):ఆమనగల్ మున్సిపాలిటీ 5వ వార్డులో మౌలిక వసతుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని కాలనీవాసుడు జంతుక శివతో పాటు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపై నిలుస్తుండగా, డ్రైనేజీలకు మూతలు లేక దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సీసీ రోడ్లకు ఇరువైపులా మట్టి, చెత్తాచెదారం పేరుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు. బజారునల్లా విరిగి పోవడంతో వారం రోజులుగా నీరు లీకై రోడ్డుపై నిలుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పలు ప్రాంతాల్లో వీధి దీపాలు లేక రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇతర వార్డుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ 5వ వార్డులో మాత్రం ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఎవరూ రావడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని జంతుక శివ తెలిపారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్, స్థానిక కౌన్సిలర్ వెంటనే వార్డులో పర్యటించి సమస్యలను గుర్తించి డ్రైనేజీలకు మూతలు, పారిశుద్ధ్య చర్యలు, బజారునల్లా మరమ్మతులు, రోడ్ల శుభ్రత, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులను చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

# అమ్రాబాద్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం



అమ్రాబాద్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):అమ్రాబాద్ మండల కేంద్రంలో నివిశ్వ ప్రధామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన ట్రస్ట్ చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిగుర్ల కోటయ్య, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ కే. గోపాల్, ఫారెస్ట్ రేంజర్ వీరేష్, హెడ్మాస్టర్ బాల కిషన్, ఎస్సీ సెల్ నాయకుడు చింతల రాజగోపాల్, మైనారిటీ అధ్యక్షుడు సర్దార్, ట్రస్ట్ బృందం సభ్యులు ప్రకాశ్ రాపాక, దేవదాస్ సాగర్, కృష్ణ, గుగులోతు రవి,
పి.ఈ. రాజు తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల ఆత్మగౌరవ పోరాటానికి పాపన్న స్ఫూర్తి

**– పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ**

**– విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు**



ఆమనగల్లు, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం, పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కంఠమహేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో గౌడ సంఘం, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తల్లోజు ఆచారి, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, కౌన్సిలర్ పాపిశెట్టి రాము ముఖ్య అతిథులుగా హాజరై పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంకుశ పాలనను ఎదిరించి అణగారిన, బహుజన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ పోరాడారని తెలిపారు. సామాజిక సమానత్వం, బహుజనుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తెలంగాణ గడ్డపై జన్మించిన పాపన్న గౌడ్ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ఆశయాల సాధనకు యువత ముందుండాలని, సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన చరిత్రను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు భావితరాలకు పాపన్న గౌడ్ చేసిన పోరాటాలను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి గౌడ సంఘం అధ్యక్షులు, ఆమనగల్లు కో–ఆప్షన్ సభ్యులు చుక్క అల్లాజీ గౌడ్, తాలూకా ఉపాధ్యక్షులు గంగా రవీందర్ గౌడ్, మండల అధ్యక్షులు చుక్క నిరంజన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, కౌన్సిలర్లు ముక్కాల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, పాపన్న యువజన సంఘం అధ్యక్షుడు గజ్జె రాఘవేందర్ గౌడ్, గుండ్రాతి నరేష్, నిరంజన్, నరసింహ, బాలకృష్ణ, అల్లాజీ, సతీష్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ పీఏసీ సమావేశం



నాగర్‌కర్నూల్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీఏసీ సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొని పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయి కార్యకలాపాల విస్తరణ, ప్రజలకు చేరువగా కార్యక్రమాలు నిర్వహించే దిశగా చర్చించారు.ఈ సమావేశంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ, సంపత్, సరిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల బస్సులను శుభకార్యాలకు వినియోగించొద్దు

**– ట్రస్మా, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వాహకుల వినతి**



ఆమనగల్లు, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులను విద్యార్థుల రవాణాకు మాత్రమే వినియోగించాలని, వివాహాలు, శుభకార్యాలు, ఇతర వ్యక్తిగత కార్యక్రమాలకు ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలని ఆమనగల్లు టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల సంఘం (ట్రస్మా), ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు వినతిపత్రాలు అందజేశారు. పాఠశాల బస్సులను వివాహ వేడుకలకు వినియోగించడం వల్ల స్థానిక టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వాహకుల ఉపాధి, వ్యాపార అవకాశాలపై ప్రభావం పడుతోందని వారు పేర్కొన్నారు. వివాహాలు, ఇతర శుభకార్యాలకు అవసరమైన బస్సులను స్థానిక టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వాహకుల నుంచి తీసుకునేలా పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల రవాణా కోసం ఉద్దేశించిన పాఠశాల బస్సులను ఇతర కార్యక్రమాలకు వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కల్వకుర్తి తాలూకా ఇన్‌చార్జ్ ఎడ్ల శ్రీశైలం, వర్త్యావత్ పాండు, ఇస్లావత్ రమేష్, నేనావత్ హనుమంతు, కొమ్ముగోని శీను, దేరంగుల మహేష్, ధర్మేందర్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు


# ఉప సర్పంచ్ లింగం మృతికి గోలి శ్రీనివాస్ రెడ్డి సంతాపం

**– కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం**




ఆమనగల్లు, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):వెల్దండ మండలం గుండాల గ్రామ ఉప సర్పంచ్ కొమ్ము లింగం మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. లింగం కుటుంబానికి అండగా నిలవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ఆయన సూచన మేరకు బీఆర్ఎస్ మండల నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని నాయకులు భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు జోగయ్య, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, మాజీ జడ్పీటీసీ జంగయ్య, మాజీ ఎంపీటీసీలు జ్యోతి నిరంజన్, లింగం, 4వ వార్డు సభ్యురాలు సునీత ఆనంద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగయ్యతో పాటు దాసు, గుండాల శ్రీను, సత్యం, ప్రవీణ్, వెంకటయ్య, రవి, తిరుపతి, జగన్, రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మనం వాడుతున్న ప్రోబయోటిక్ ట్యాబ్లెట్లపై ఆసక్తికర అధ్యయనం.. అవి మనకు సరిపోవట..



మన జీర్ణవ్యవస్థలో ఉండే సూక్ష్మజీవులు ఆహారం, జీవనశైలి, తరతరాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అందుకే అందరికీ ఒకే రకమైన ప్రోబయోటిక్ ఉత్పత్తులు సమానంగా పనిచేస్తాయా అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశంలోని వివిధ గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌ను పరిశీలించిన తాజా పరిశోధనలో ఇప్పటివరకు గుర్తించని కొన్ని బ్యాక్టీరియా జాతులతోపాటు వందలాది స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లు బయటపడటం ఈ అంశంపై కొత్త చర్చకు దారితీసింది. దేశంలోని కొన్ని గిరిజన సముదాయాలకు చెందిన ఆరోగ్యవంతుల గట్ మైక్రోబయోమ్‌ను పరిశోధకులు పరిశీలించారు. ఈ సముదాయాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. కొందరు ఎక్కువగా పాల ఉత్పత్తులు, సంపూర్ణ ధాన్యాలు తీసుకుంటుండగా, మరికొందరి ఆహార విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఈ పరిశీలనలో ఆహారపు అలవాట్లకు, గట్‌లో నివసించే బ్యాక్టీరియా లక్షణాలకు మధ్య ఆసక్తికరమైన సంబంధం కనిపించింది.ఆహారాల్లో తేడాలే కారణం..తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు గట్‌లోని బ్యాక్టీరియాపై ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతున్నట్లు పరిశోధన సూచించింది. సాధారణంగా కనిపించే బిఫిడోబ్యాక్టీరియం అడోలెసెంటిస్ వంటి బ్యాక్టీరియాలోనూ పాశ్చాత్య దేశాల ప్రజల గట్ నమూనాల్లో అరుదుగా కనిపించే కార్బొహైడ్రేట్ ప్రాసెసింగ్ జన్యువులను గుర్తించారు. అంటే భారతీయుల సంప్రదాయ ఆహారంలో ఉండే కొన్ని పదార్థాలను జీర్ణం చేసుకోవడానికి ఇక్కడి గట్ బ్యాక్టీరియా కాలక్రమేణా ప్రత్యేకంగా అనుకూలించి ఉండే అవకాశం ఉంటుంది. బార్లీ, గోధుమలు, సంప్రదాయ పాల ఉత్పత్తులు వంటి ఆహార పదార్థాలను జీర్ణం చేసుకోవడంలో సహాయపడే కొన్ని ప్రత్యేక లక్షణాలు స్థానిక బ్యాక్టీరియాలో కనిపించినట్లు పరిశోధన వెల్లడించింది. దీని ద్వారా మనం తీసుకునే ఆహారం కేవలం మన శరీరాన్నే కాకుండా, మన గట్‌లో నివసించే సూక్ష్మజీవుల సముదాయాన్ని కూడా ప్రభావితం చేస్తుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు మార్కెట్లో లభించే అనేక ప్రోబయోటిక్ ఉత్పత్తుల్లో యూరప్, ఉత్తర అమెరికా వంటి పాశ్చాత్య ప్రాంతాల ప్రజల్లో గుర్తించిన బ్యాక్టీరియా స్ట్రెయిన్లను ఉపయోగిస్తున్నారు. మంచి బ్యాక్టీరియాగా పరిగణించే ఒక స్ట్రెయిన్ ఎక్కడి వ్యక్తి గట్‌లోకి వెళ్లినా ఒకే విధంగా పనిచేస్తుందనే ఆలోచన దీనికి కారణం. అయితే తాజా పరిశోధన ఈ విధానాన్ని మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.ప్రోబయోటిక్స్ ఆపేయాలా..ఒక నిర్దిష్ట ఆహార విధానానికి, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా అభివృద్ధి చెందిన బ్యాక్టీరియా మరో రకమైన ఆహారపు అలవాట్లు ఉన్న వ్యక్తి గట్‌లోకి వెళ్లినప్పుడు అదే స్థాయిలో స్థిరపడవు. అలాగే అక్కడ ఉన్న సూక్ష్మజీవుల సముదాయంతో పనిచేయవు.

# మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో రెండో రోజు కొనసాగిన ఆందోళన



మిర్యాలగూడ, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):రోగికి మంచినీటి బదులు యాసిడ్ బాటిల్ ఇచ్చిన ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు రెండో రోజు కూడా ఆసుపత్రి సూపరిండెంట్ ఛాంబర్ ఎదుట ఆందోళన కొనసాగించారు.వారం క్రితం కడుపు నొప్పితో ఆసుపత్రికి వచ్చిన కురిమిళ్ల చంద్రయ్య మందులు వేసుకోవడానికి నీరు అడగగా, కాంటిన్జెన్సీ వర్కర్ యాసిడ్ బాటిల్ ఇచ్చాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దాంతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు కూడా మద్దతుగా నిలిచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సూపరిండెంట్ తమ వల్ల తప్పు జరగలేదని, విచారణకు సిద్ధమని తెలిపారు. సర్పంచ్ డాక్టర్ మాతృ నాయక్ బాధితులకు ఫిర్యాదు చేయమని సూచించారు.ఆసుపత్రి వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగడంతో ఎస్సై బి. రాంబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



## ఆటో కార్మికుల సమ్మెకు మద్దతు కోరిన ఏఐటీయూసీ



**కల్వకుర్తి, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు దేశం సైదులు మాట్లాడుతూ, "ఆగస్టు 24 నుండి జరగబోయే ఆటో కార్మికుల సమ్మెను జయప్రదం చేయడానికి ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలపాలి" అని కోరారు. ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి కార్మికునికి ప్రతి సంవత్సరం రూ. 12,000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆటో కార్మికులు ఎస్.కె. అమీర్, రాజేష్, ఓర్సు బాలస్వామి, మహేష్, నాగరాజు, లక్ష్మీకాంత్ రెడ్డి, యాదగిరి, జనార్ధన్, పరశురాం గౌడ్, మురళి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తోటపల్లిలో ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**కల్వకుర్తి, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండలంలోని తోటపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ, "పాపన్న గౌడ్ పోరాటం, ధైర్యసాహసాలు, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి నేటి యువతకు ఆదర్శం. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. గ్రామ పెద్దలు, గౌడ సంఘం నాయకులు, బంధువులు, యువజన సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీల విజేతలకు బహుమతులు




**ఆమనగల్, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ శ్రీపాద శార్వాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆమనగల్ మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు మాధవరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సమష్టి భావన పెంపొందుతాయని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో ఎడ్మ కిష్టారెడ్డి వర్ధంతి




**కల్వకుర్తి, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి 6వ వర్ధంతి వేడుకలు మంగళవారం కల్వకుర్తి పట్టణంలో ఘనంగా జరిగాయి. ప్రజలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ, "పేదల ఆశాజ్యోతి ఎడ్మ కిష్టారెడ్డి, ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటాలు చేసి, కల్వకుర్తి అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారు" అని కొనియాడారు. ఆయన ఆర్డీఓ కార్యాలయం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి సాధించిన ఘనతను గుర్తుచేశారు. వర్ధంతి సందర్భంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో కూడా కార్యక్రమాలు నిర్వహించారు.

# ప్రజా సేవలో కృష్ణారెడ్డికి ప్రత్యేక స్థానం

**– 6వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళు లర్పించిన బీఆర్ఎస్ నాయకులు**



**ఆమనగల్లు, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి 6వ వర్ధంతిని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమానులు మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణారెడ్డి కుమారుడు, కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృష్ణారెడ్డి నిరంతరం కృషి చేశారని, నియోజకవర్గ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేశారని అన్నారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గాన్ని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కృష్ణారెడ్డి సేవా స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకుని ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగిళ్ళ జగన్, మాజీ ఎంపీటీసీ చందు నాయక్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుల రాములు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్, పట్టణ ఉపాధ్యక్షుడు పూసల భాస్కర్, చలిచీమల సతీష్, కంబాలపల్లి రమేష్, వద్దే వెంకటేష్, మహేష్ నేత, లండన్ జంగిలి, రామ్ నాయక్, రమేష్‌తో పాటు కృష్ణారెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా.. బాధిత కుటుంబాలకు రాము భరోసా

**– మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక చేయూత అందించిన 5వ వార్డు కౌన్సిలర్**



**ఆమనగల్లు, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆపదలో ఉన్న కుటుంబాలకు తనవంతు సహకారం అందిస్తూ మానవతా దృక్పథాన్ని చాటుకుంటున్న ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్, ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము మంగళవారం మూడు మృతుల కుటుంబాలను పరామర్శించారు. మాడుగుల మండలం దొడ్లపహాడ్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన వార్తా రిపోర్టర్ తిరుపతయ్యగౌడ్ తండ్రి, వెల్దండ మండలం గుండాల గ్రామ ఉపసర్పంచ్ కొమ్ము లింగమయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాము ఆయా గ్రామాలకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతుల కుటుంబాలకు తనవంతు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో పెద్దను కోల్పోవడం తీరని లోటని, బాధిత కుటుంబాలకు తనవంతు అండగా ఉంటానని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు ఈదమయ్య, శ్రీనివాసులు, ఉపసర్పంచులు జంగయ్య, రాజీవ్, గ్రామస్తులు పెద్దయ్య, అంజయ్య, సామల అంజయ్య, యాదయ్య, లాలయ్య, జంగమ్మ, రమేష్, పోచయ్య, కృష్ణ, పుల్లయ్య, బాలు, లాలయ్యగౌడ్, రంగయ్య, వెంకటయ్య, బాలయ్య, రామన్న, మిత్రమండలి సభ్యులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ ఆశయాలే బహుజనులకు మార్గదర్శకం

**– సరికొండలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు**



**ఆమనగల్లు, ఆగస్టు 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బహుజనుల ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సరికొండ గ్రామ సర్పంచ్ అద్దాల పాలకూర్ల మహేందర్ గౌడ్ అన్నారు. మంగళవారం సరికొండ గ్రామపంచాయతీ ఆవరణలోని పాపన్న గౌడ్ విగ్రహం వద్ద గ్రామ గౌడ, గీత కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ మహేందర్ గౌడ్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన పాపన్న గౌడ్ ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని అన్నారు. బహుజన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు రాములు, ఉపాధ్యక్షులు యాదయ్య, మాజీ ప్రజాప్రతినిధులు నర్సింహ, లక్ష్మయ్య, వెంకటయ్య, వివిధ పార్టీల నాయకులు, గౌడ సంఘం నాయకులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విటమిన్ బి12 లోపంతో ఆందోళన పెరుగుతుందా నిపుణులు ఏం చెబుతున్నారంటే..




ఆందోళన, చిరాకు, అలసట వంటి సమస్యలకు ఒత్తిడి లేదా మానసిక ఆరోగ్య పరిస్థితులే కారణమని చాలామంది భావిస్తారు. అయితే శరీరంలో కొన్ని ముఖ్యమైన పోషకాలు లోపించినా ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంగుంది. ముఖ్యంగా విటమిన్ బి12 లోపం మెదడు పనితీరు, నాడీ వ్యవస్థ, మానసిక స్థితిపై ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో బి12 స్థాయిలు తగ్గడం వల్ల ఆందోళనను పోలిన లక్షణాలు కూడా కనిపిస్తాయి. అయితే ప్రతి వ్యక్తిలో దీని ప్రభావం ఒకేలా ఉండదు. విటమిన్ బి12 నాడులు సక్రమంగా పనిచేయడానికి, మెదడు మధ్య సమాచార మార్పిడికి అవసరమైన న్యూరోట్రాన్స్‌మిటర్ల తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల శరీరంలో బి12 తగినంతగా లేకపోతే ఆందోళన, చిరాకు, భయాందోళన, మానసిక స్థితిలో మార్పులు, తక్కువ ఉత్సాహం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. విటమిన్ బి12ని కోబాలమిన్ అని కూడా పిలుస్తారు. ఇది నీటిలో కరిగే విటమిన్. మెదడు పనితీరు, నాడుల ఆరోగ్యం, ఎర్ర రక్త కణాల తయారీ, డీఎన్ఏ నిర్మాణం వంటి అనేక ముఖ్యమైన ప్రక్రియలకు ఇది అవసరం. శరీరం తగినంత బి12ను స్వయంగా తయారు చేసుకోలేకపోవడంతో ఆహారం ద్వారా పొందాలి. చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చికెన్, మాంసం వంటి వాటిలో విటమిన్ బి12 లభిస్తుంది. నాడీ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటంలో విటమిన్ బి12కి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. నరాలపై ఉండే మైలిన్ అనే రక్షణ పొరను నిర్వహించడంలో ఇది సహాయపడుతుంది. ఈ రక్షణ పొర సరిగ్గా ఉంటే మెదడు, వెన్నుపాము, శరీరంలోని ఇతర భాగాల మధ్య విద్యుత్ సంకేతాలు సక్రమంగా ప్రసారం అవుతాయి. బి12 లోపం ఏర్పడినప్పుడు నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఎర్ర రక్త కణాల తయారీలోనూ బి12 కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి ప్రభావితమై మెగాలోబ్లాస్టిక్ అనీమియా వంటి సమస్యలు ఏర్పడతాయి. దాంతో శరీరానికి ఆక్సిజన్ సరఫరా సరిగా జరగక అలసట, బలహీనత, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మెదడు ఆరోగ్యానికి కూడా బి12 అవసరం. ఈ విటమిన్ స్థాయిలు చాలా తక్కువగా ఉన్నప్పుడు జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచనా సామర్థ్యంలో మార్పులు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన లోపం ఉన్నప్పుడు మరింత తీవ్రమైన నాడీ సంబంధిత సమస్యలు కూడా ఏర్పడే అవకాశం ఉంటుంది. ఆందోళన పెరుగుతుందా.. విటమిన్ బి12 లోపం ఆందోళన లక్షణాలను పెంచడానికి ఒక కారణం అవుతుందని చెబుతున్నారు. శరీరంలో బి12 తక్కువగా ఉన్నప్పుడు మెదడు పనితీరుకు అవసరమైన కొన్ని రసాయన ప్రక్రియలు ప్రభావితమవుతాయి. ముఖ్యంగా హోమోసిస్టీన్ అనే పదార్థాన్ని మెథియోనిన్‌గా మార్చే ప్రక్రియలో బి12 అవసరం. ఈ ప్రక్రియ మెదడు పనితీరు, మానసిక స్థితి నియంత్రణకు సంబంధించిన జీవరసాయన చర్యల్లో భాగం. బి12 లోపం వల్ల అలసట, బలహీనత, మెదడు మబ్బుగా అనిపించడం వంటి సమస్యలు కూడా వస్తాయి. ఇవి రోజువారీ పనితీరుపై ప్రభావం చూపడంతో కొందరిలో ఆందోళన మరింత ఎక్కువగా అనిపించే అవకాశం ఉంటుంది. అలాగే నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినడం వల్ల చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కొన్నిసార్లు పానిక్ అటాక్ లక్షణాలను పోలి ఉంటాయి.

ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు శారీరక లక్షణాలతోపాటు నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపిస్తాయి. తీవ్రమైన అలసట, బలహీనత, చర్మం పాలిపోయినట్లు కనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం వంటి సమస్యలు వస్తాయి. చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, సమతుల్యత కోల్పోవడం, జ్ఞాపకశక్తి సమస్యలు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపించే అవకాశం ఉంటుంది. మానసిక ఆరోగ్యానికి సంబంధించి ఆందోళన, చిరాకు, డిప్రెషన్, మూడ్‌లో మార్పులు, ఏకాగ్రత లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఇలాంటి లక్షణాలు కనిపించిన ప్రతిసారీ బి12 లోపమే కారణమని భావించకూడదు. ఆందోళనకు అనేక ఇతర కారణాలు కూడా ఉంటాయి. కొంతమందిలో విటమిన్ బి12 లోపం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పూర్తిగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారిలో బి12 లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. సహజంగా బి12 లభించే మొక్కల ఆధారిత ఆహార పదార్థాలు చాలా తక్కువగా ఉండటం ఇందుకు ఒక కారణం. వయసు పెరిగే కొద్దీ బి12 శోషణ తగ్గే అవకాశం ఉన్నందున వృద్ధుల్లోనూ లోపం కనిపిస్తుంది. జీర్ణ వ్యవస్థ సమస్యలు ఉంటే..జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఉన్నవారిలోనూ ఆహారం నుంచి బి12 శరీరంలోకి శోషించుకోవడం తగ్గుతుంది. అలాగే మెట్‌ఫార్మిన్, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ వంటి కొన్ని మందులను దీర్ఘకాలం ఉపయోగించే వారు కూడా బి12 స్థాయిలపై వైద్యుల సలహా తీసుకోవాల్సి ఉంటుంది. బి12 లోపం ఉన్నవారికి లోపాన్ని సరిచేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. అయితే బి12 స్థాయిలు సాధారణంగా ఉన్న ప్రతి ఒక్కరూ అదనంగా బి12 సప్లిమెంట్లు తీసుకోవాల్సిన అవసరం లేదు. సాధారణ బి12 స్థాయిలు ఉన్నవారిలో కేవలం సప్లిమెంట్లు తీసుకోవడం ద్వారా ఆందోళన గణనీయంగా తగ్గుతుంది. ఎప్పటికప్పుడు లేదా నిరంతరం ఆందోళనగా అనిపించడం, కారణం తెలియని తీవ్రమైన అలసట, చేతులు లేదా కాళ్లలో తిమ్మిర్లు, జ్ఞాపకశక్తి సమస్యలు, సమతుల్యతలో ఇబ్బందులు వంటి లక్షణాలు ఉంటే విటమిన్ బి12 స్థాయిలను పరీక్షించుకోవడం గురించి వైద్యుడిని సంప్రదించవచ్చు. ముఖ్యంగా దీర్ఘకాలంగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారు బి12 స్థాయిలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వైద్య పరీక్షలు అవసరం..విటమిన్ బి12 లోపం కొన్ని సందర్భాల్లో ఆందోళనను పోలిన లక్షణాలకు లేదా నాడీ సంబంధిత సమస్యలకు కారణం అవుతుంది. అయితే ఆందోళనకు బి12 లోపమే ఏకైక కారణమని చెప్పలేం. లక్షణాలను బట్టి సరైన వైద్య పరీక్షలు చేయించుకుని అసలు కారణాన్ని గుర్తించడం చాలా ముఖ్యం. బి12 లోపం నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు ఆహారం లేదా సప్లిమెంట్ల ద్వారా దాన్ని సరిచేసుకోవాలి.

# భారత్ విజయం లాంఛనమే!!

**భారత్ రెండో ఇన్నింగ్స్‌లో193కి ఆలౌట్**

**372.. శ్రీలంక ముందు భారీ లక్ష్య ఛేదన**

**గెలుపుకు ఆరు వికెట్ల ముంగిట భారత్**

**శ్రీలంక విజయానికి 288 పరుగులు**

**గెలుపుకు చివరి రోజు మిగిలిన ఆట**



శ్రీలంకతో తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. కానీ వరణుడిపైనే భారత్ విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. బుధవారం ఆఖరి రోజు ఆటలో వరణుడు రెండు సెషన్ల పాటు అంతరాయం కలిగించకపోతే భారత్ విజయం లాంఛనం కానుంది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. క్రీజులో ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) ఉన్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీసారు. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 48.5 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(69 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. దేవదత్ పడిక్కల్(75 బంతుల్లో 6 ఫోర్లతో 44) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/31) నాలుగు వికెట్లు తీయగా.. ప్రబాత్ జయసూర్య(3/43) మూడు వికెట్లు పడగొట్టాడు. కేశర నువాంత ఒక వికెట్ తీయగా.. లాహిరు కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగల భారీ ఆధిక్యం సాధించడంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నమోదైంది. నాలుగో రోజు ఆటలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. యశస్వి జైస్వాల్.. మూడో బంతికే డకౌట్ కాగా.. కేఎల్ రాహుల్(35), దేవదత్ పడిక్కల్(44) వేగంగా పరుగులు చేశారు. ఈ క్రమంలో రాహుల్‌ను ప్రభాత్ జయసూర్య ఔట్ చేయగా.. పడిక్కల్(44)ను కేశర నువంత పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 116/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే ధ్రువ్ జురెల్ ఔటైనా.. రవీంద్ర జడేజాతో(9) రిషభ్ పంత్ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 53 బంతుల్లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

శతకం దిశగా సాగిన పంత్(66)ను లాహిరు కుమార ఔట్ చేశాడు. పంత్ వికెట్ తర్వాత భారత ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. అయితే మూడో సెషన్ ఆటకు ముందు వర్షం అంతరాయం కలిగించింది. ఆఖరి సెషన్‌లో భారత్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

# ధ్రువ్ జురెల్ స్టన్నింగ్ క్యాచ్‌పై దుమారం



భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో అంపైర్ల నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమవుతున్నాయి. ఎల్బీడబ్ల్యూ, క్యాచ్‌ల విషయంలో అంపైర్లపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అంపైర్ల తీరు కారణంగానే తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేసిందని మూడో రోజు ఆట అనంతరం భారత స్పిన్నర్ మానవ్ సుతార్ అనడం తీవ్ర వివాదాస్పదమైంది. నాలుగో రోజు ఆటలో కేఎల్ రాహుల్ ఎల్బీడబ్ల్యూ విషయంలో అంపైర్ ఘోర తప్పిదం చేయడం.. డీఆర్ఎస్ ద్వారా అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోవడం కూడా చర్చనీయాంశమైంది. ఆఖరి సెషన్‌లో భారత ఫీల్డర్ ధ్రువ్ జురెల్ అందుకున్న లో-క్యాచ్‌పై కూడా దుమారం రేగుతోంది. శ్రీలంక ఓపెనర్ లాహిరు ఉడారా ఇచ్చిన లో- స్లిప్ క్యాచ్‌ను ధ్రువ్ జురెల్ అద్భుతంగా అందుకున్నాడు. అయితే క్యాచ్ అందుకునే క్రమంలో బంతి నేలకు తాకినట్లుగా రిప్లేలో కనిపించింది. కానీ ఫీల్డ్ అంపైర్ ఔటిచ్చాడు. ఈ నిర్ణయంపై శ్రీలంక కోచ్‌లు, ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్ సందర్భంగా మానవ్ సుతార్ వేసిన 22వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ నాలుగో బంతిని లాహిరు ఉడారా డిఫెన్స్ చేయగా బంతి గల్లీ వైపు లో-క్యాచ్‌గా వచ్చింది. అక్కడే ఉన్న ధ్రువ్ జురెల్ బంతిని అద్భుతంగా అందుకున్నాడు. రిప్లేలను పరిశీలించిన అంపైర్ బంతి కింద చేతివేళ్లు ఉన్నాయని ఔటిచ్చాడు. అయితే ఈ నిర్ణయంపై లాహిరు ఉడారా అసంతృప్తి వ్యక్తం చేశాడు. అసహనంగా క్రీజును వీడాడు. ప్రస్తుతం ఈ క్యాచ్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.




# శ్రీలంక ఆటగాడి మెడకు తీవ్ర గాయం..

భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో దురదృష్టకర ఘటన చోటు చేసుకుంది. మంగళవారం నాలుగో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తూ శ్రీలంక ఫీల్డర్ దినేష్ చండీమల్ తీవ్రంగా గాయపడ్డాడు. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయిన చండీమల్‌కు మెడతో పాటు కుడి భుజానికి బలమైన గాయమైంది. దాంతో అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాలుగో రోజు ఆట తొలి సెషన్ ఆరంభంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. కేశర నువాంత వేసిన నాలుగో ఓవర్ ఆఖరి బంతిని కేఎల్ రాహుల్.. స్వీప్ షాట్‌తో డీప్ బ్యాక్‌వార్డ్ స్క్వేర్ లెగ్ దిశగా ఆడగా.. దినేష్ చండీమల్ పరుగెత్తుకుంటూ వచ్చి బంతిని ఆపే ప్రయత్నంలో కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతని కుడి భుజం బలంగా నేలకు తాకడంతో మెడకు తీవ్ర గాయమైంది. ఫిజియోలు పరీక్షించి అతన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే అతని స్కానింగ్ తీయించామని, అంతర్గత గాయాలు ఏమి లేవని శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. కంకషన్ టెస్ట్‌లో చండిమాల్ విఫలమయ్యాడని, దాంతో అతను ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని తెలిపింది. అతని స్థానంలో పసిందు సూర్య బండార ఆడుతాడని పేర్కొంది. కంకషన్ సబ్‌స్టిట్యూట్‌కు మ్యాచ్ రిఫరీ ఆమోదం తెలిపారని తమ ప్రకటనలో స్పష్టం చేసింది. దాంతో అనూహ్య పరిస్థితుల్లో సూర్య బండార అంతర్జాతీయ టెస్ట్‌ల్లోకి అరంగేట్రం చేశాడు. అయితే తన రాకను ఘనంగా చాటుకోలేకపోయాడు. 372 పరుగుల లక్ష్య ఛేదన కోసం శ్రీలంక రెండో ఇన్నింగ్స్ ప్రారంభించగా.. సూర్య బండార(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మానవ్ సుతార్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. మానవ్ సుతార్‌తో పాటు సిరాజ్, ప్రసిధ్ కృష్ణ సత్తా చాటడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో కెప్టెన్ దనంజయ డిసిల్వా(24 బ్యాటింగ్), సోనాల్ దినుషా(8 బ్యాటింగ్) ఉన్నారు. భారత్ విజయానికి ఇంకా 6 వికెట్లు అవసరం కాగా.. శ్రీలంక 300 ప్లస్ రన్స్ చేయాల్సి ఉంది.

# గాయత్రీ , శ్రీకాంత్‌లకు అర్జున అవార్డు..

**మొత్తం 17 మందికి ఈ పురస్కారాలు**




కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక నేషనల్ స్పోర్ట్స్ అవార్డ్స్ 2025 జాబితాను మంగళవారం అధికారికంగా ప్రకటించింది. తెలుగు తేజం, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రి, షూటర్ శ్రీకాంత్ లకు ప్రతిష్టాత్మక అర్జున అవార్డు దక్కింది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అయిన గాయత్రీ, షూటర్ అయిన శ్రీకాంత్.. సాధించిన ఘనతలకు మెచ్చి, కేంద్రం ఈ పురస్కారం ప్రకటించింది. వీరితోతోపాటు మొత్తం 17 మంది అథ్లెట్లకు అర్జున అవార్డులు దక్కగా, ఒకరికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం లభించింది. అయితే ఈ అవార్డుల ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన అంశం దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఒక్కరి పేరు కూడా ఎంపిక కాకపోవడమే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఈ అవార్డులను ఖరారు చేసింది. గత నాలుగేళ్ల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు ఖేల్ రత్న పురస్కారాన్ని అందిస్తుంటారు. 2024 లో చెస్ వరల్డ్ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజు, ఇండియన్ మెన్స్ హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ లకు ఖేల్ రత్న లభించింది. కానీ 2025 అవార్డుల సైకిల్‌లో ఏ ఒక్క క్రీడాకారుడి పేరును కమిటీ నామినేట్ చేయకపోవడంతో ఈ అత్యున్నత గౌరవ జాబితా ఖాళీగా మిగిలిపోయింది. గత నాలుగేళ్లలో నిలకడైన ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ ప్రదర్శించిన వారికి అర్జున అవార్డులను ప్రకటించారు. హైజంపర్ తేజస్విన్ శంకర్, స్ప్రింటర్లు మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి, బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ త్రీసా జాలీ, చెస్ గ్రాండ్‌మాస్టర్లు విదిత్ గుజరాతి, దివ్య దేశ్‌ముఖ్, హాకీ స్టార్లు లాల్‌రెమ్‌సియామి, రాజ్‌కుమార్ పాల్, షూటర్ అఖిల్ షెరాన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్నారు. వీరితో పాటు పారా షూటర్ రుద్రాంశ్ ఖండేల్వాల్, పారా అథ్లెట్ ఏక్తా భ్యాన్, రోయింగ్ ప్లేయర్ అరవింద్ సింగ్, బాక్సర్ నరేందర్, కబడ్డీ ప్లేయర్లు సుర్జీత్, పూజ, డెఫ్ షూటర్ ధనుష్ శ్రీకాంత్.. అర్జున అవార్డు గ్రహీతల జాబితాలో నిలిచారు. 1962 ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన భారత ఫుట్‌బాల్ టీమ్ సభ్యుడు ఐ. అరుమై నాయగం కు లైఫ్‌టైమ్ కేటగిరీలో అర్జున అవార్డు దక్కింది. కోచ్ లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డుల రెగ్యులర్ కేటగిరీలో అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్ ఛోటే లాల్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్ ఎంపికయ్యారు. లైఫ్‌టైమ్ కేటగిరీలో బాక్సింగ్ కోచ్ ధర్మేంద్ర సింగ్ యాదవ్, రెజ్లింగ్ కోచ్ వీరేందర్ కుమార్ లకు ద్రోణాచార్య దక్కింది. క్రీడల ప్రోత్సాహానికి కృషి చేసిన కార్పొరేట్, ఎన్జీవో విభాగంలో అందించే రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం పూణేకు చెందిన ఆర్మీ పారాలింపిక్ నోడ్ కు లభించింది. ఖేల్ రత్న అవార్డు లేకపోవడం మినహా మిగతా విభాగాల్లో పెద్ద సంఖ్యలోనే భారతీయ క్రీడాకారులకు గుర్తింపు లభించింది.

# లక్ష్యసేన్ శుభారంభం

**ప్రీ క్వార్టర్స్‌లో గాయత్రి, ట్రెసా జోడీ**

**బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్**




**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో 14వ సీడ్, భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ తొలి రౌండ్లో గట్టెక్కాడు. మంగళవారం న్యూఢిల్లీలోని ఇంధిరాగాంధీ ఇండోర్‌స్టేడియంలో జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ఆస్ట్రియా ఆటగాడు కొలిన్స్ వాలంటైన్ ఫిలిమాన్‌పై లక్ష్యసేన్ 16-21, 21-8, 21-4తో మూడు గేముల మ్యాచ్‌లో గెలుపొందాడు. తొలి గేమ్‌లో 16-21తో తడబడిన లక్ష్యసేన్ 15 నిమిషాల్లో కంగుతిన్నాడు. కానీ ఆ తర్వాత వరుస గేములను అలవోకగా 30 నిమిషాల్లోనే నెగ్గాడు. తొలి గేమ్, తర్వాతి రెండు గేమ్‌ల్లో భిన్నమైన ఆటతీరుతో లక్ష్యసేన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌ను విజయంతో మొదలెట్టాడు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా సైతం తొలి రౌండ్లో అలవోక విజయం సాధించింది. మయన్మార్ షట్లర్ తుజార్‌పై 22-20, 21-16తో ఉన్నతి హుడా 40 నిమిషాల్లోనే రెండో రౌండ్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి, ట్రెసా జోడీ 21-15, 21-12తో 16వ సీడ్ అమెరికా జోడీ లారెన్, అలిసన్‌లను వరుస గేముల్లో మట్టికరిపించి ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. కవిప్రియ, సిమ్రన్ సింఘి జంట 7-21, 14-21తో రెండో రౌండ్ల నిరాశపరచగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో అసిత్ సూర్య, అమృత జోడీ 21-16, 29-30, 22-24తో పోరాడి ఓడింది. రోహన్ కపూర్, రుత్విక శివాని జంట సైతం 22-20, 10-21, 17-21తో మూడు గేముల మ్యాచ్‌లో పోరాడి ఓడింది.


# అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా




కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవు తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే ఈ సినిమాలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమాలో 'మ్లలెపూల పల్లకి బంగారు పల్లకి' అంటూ సాగే పాటలో రామ్ చరణ్ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తారని.. కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై రామ్‌చరణ్ టీమ్ తాజాగా స్పందించింది. అవి రూమర్స్ అంటూ ఖండించింది. అసత్యాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేసింది.

# ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్

## రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్




టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

----




# డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు

తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ.85 కోట్ల వసూళ్లను సాధించి, రూ.100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.

-------------

# సంక్రాంతి బరిలో మెగా 158 మూవీ




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్- శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.

# అనుపమ వ్యాఖ్యల ఎఫెక్ట్..

## తొలిసారి మౌనం వీడిన ధ్రువ్ విక్రమ్!



గత కొన్ని వారాలుగా తన వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై యువ నటుడు ధ్రువ్ విక్రమ్ తొలిసారి బహిరంగంగా స్పందించాడు. తన సహనటి అనుపమ పరమేశ్వరన్ గతంలో ఓ రెండేళ్ల సంబంధంలో తాను ఎదుర్కొన్న నియంతృత్వం, నార్సిసిజం గురించి మాట్లాడిన తర్వాత, ఆ వ్యాఖ్యలు ధ్రువ్‌ను ఉద్దేశించేనని పెద్ద ఎత్తున ఊహాగానాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలోనే ధ్రువ్ మౌనం వీడాడు.'ఇండియా టుడే తమిళ్' నిర్వహించిన ఒక రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ధ్రువ్‌ను.. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఈ ప్రచారాన్ని ఎలా ఎదుర్కొంటున్నారని ప్రశ్నించగా.. "నిజం చెప్పాలంటే, ఈ ప్రచారం నన్ను ప్రభావితం చేయలేదని నేను చెప్పలేను. కచ్చితంగా దాని ప్రభావం నాపై పడింది. కానీ, ఇలాంటి సమయంలో వాస్తవానికి కట్టుబడి ఉండటం చాలా ముఖ్యం. మనం ఎవరో, మన విలువేంటో తెలుసుకోవాలి. మనం ప్రేమించే వారిని, మనకు ముఖ్యమైన ప్రతి ఒక్కరినీ కాపాడుకోవాలి" అని ఆయన అన్నారు. బయటివారి అభిప్రాయాల ప్రభావం తనపై ఎక్కువగా ఉండదని చెబుతూ, "మీరు నిజానికి కట్టుబడి ఉన్నప్పుడు, మిమ్మల్ని ఏది నిలబెడుతుందో మీకు తెలిసినప్పుడు, బయటివారి విమర్శలు ఓ స్థాయిని దాటి వెళ్లలేవు. మనకు తెలియకుండానే మనం ఒంటరి సైన్యంలా మారతాం. మనకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకుని, మన అంతర్గత బలాన్ని కాపాడుకుంటాం" అని ధ్రువ్ వివరించాడు.ప్రముఖుల జీవితాల్లో ఇలాంటి పరిశీలన సర్వసాధారణమే అయినా, తన ప్రియమైన వారిని కాపాడుకోవడం, వ్యక్తిగత హద్దులు గీసుకోవడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నాడు. అయితే, ఈ సంభాషణలో ఆయన ఎక్కడా అనుపమ వ్యాఖ్యలను నేరుగా ప్రస్తావించలేదు. వారిద్దరి మధ్య ఏదైనా సంబంధం ఉందన్న ఊహాగానాలపై కూడా స్పందించకుండా సంయమనం పాటించాడు. ప్రస్తుతం ధ్రువ్ విక్రమ్, అనుపమ పరమేశ్వరన్ కలిసి 'బైసన్ కాలమాడన్' అనే చిత్రంలో నటిస్తున్నారు




# నిధి అగర్వాల్ కొత్త సినిమా..

## మైథలాజికల్ థ్రిల్లర్!

హీరోయిన్ నిధి అగర్వాల్ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈసారి ఆమె ఓ విభిన్న కథతో అలరించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుందని సినీ వర్గాల సమాచారం. హీరోయిన్ ప్రధానంగా సాగే ఈ కథలో ఆమె ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా ఆ సంస్థకు తొలి ప్రొడక్షన్. సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. నిధి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. అదే రోజు చిత్రీకరణ కూడా మొదలైంది.సినిమా ప్రారంభోత్సవంలో పి. అశోక్, పి. రేణుక తొలి షాట్‌కు కెమెరా స్విచాన్ చేశారు. నిధి అగర్వాల్ చిత్రబృందంతో కలిసి కార్యక్రమంలో పాల్గొంది. ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్', పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీర మల్లు' చిత్రాల్లో నిధి నటనకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తోంది.సినిమా ప్రారంభం సందర్భంగా మేకర్స్ నిధి ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. అందులో ఆమె ఒక చేతిలో దీపం పట్టుకుని.. మరో చేతితో దానికి రక్షణగా నిలిచినట్లు కనిపిస్తోంది. వెనుక భాగంలో అనేక చేతులతో ఉన్న దేవత ఆకారం కనిపిస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి హీరోయిన్ చుట్టూ తిరిగేలా బలమైన కథను సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.